
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 25 ఏప్రిల్ 2025





ప్రధాని సభకు 1.20 లక్షల మంది!

మే 2న రాజధాని పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

- కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల నుంచి రాక
- ప్రధాని మోదీ రోడ్డు షోకు హాజరుకానున్న 30 వేల మంది
- సభ ప్రాంగణంలోని గ్యాలరీలకు తరలిరానున్న మరో 90 వేల మంది

2400 బస్సుల్లో ఏడు రూట్లలో సభ వద్దకు చేరనున్న ప్రజలు

విజయవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి 1.20 లక్షల మంది రానున్నట్లు సమాచారం. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి వీరు తరలివస్తున్నట్లు తెలిసింది. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 30 వేల మంది చొప్పున, కృష్ణా, బాపట్ల, ఏలూరు జిల్లాల నుంచి 10 వేల మంది చొప్పున వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాన సభా ప్రాంగణం 28 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ప్రధాన వేదికలు పోను గ్యాలరీలను 25 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సభలో సీటింగ్ 50 వేల వరకు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే వారు, వెళ్లే వారు ఉంటారు కాబట్టి మొత్తంగా 1.20 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. వీరిలో 30 వేల మంది ప్రధాని రోడ్డు షోకు వెళ్తారని మిగతా 6లో..

పెద్ద ఎత్తున బస్ సర్వీసులు

రాజధాని సభకు వచ్చే వారికి ప్రభుత్వం 2,400 బస్సులను ఏర్పాటు చేయనుంది. గుంటూరు నుంచి 600 బస్సులు, ఎన్టీఆర్ జిల్లా నుంచి 600 బస్సులు, పల్నాడు జిల్లా నుంచి 600 బస్సులు, కృష్ణాజిల్లా నుంచి 200 బస్సులు, బాపట్ల జిల్లా నుంచి 200 బస్సులు, ఏలూరు జిల్లా నుంచి 200 బస్సుల్లో ప్రజలు సభా ప్రాంగణానికి తరలిరానున్నారు.

పీఎం రోడ్డు షోకు భారీగా ఏర్పాట్లు

ప్రధాని నరేంద్ర మోదీ దిగే హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు 15 నిమిషాల పాటు జరిగే రోడ్డు షోకు మొత్తం 30 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 5 వేలు, కృష్ణాజిల్లా నుంచి 10 వేలు, బాపట్ల జిల్లా నుంచి 10 వేలు, ఏలూరు జిల్లా నుంచి 5 వేల మంది తరలివస్తారని ఆయా జిల్లా యంత్రాంగాలు అంచనా వేస్తున్నాయి.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశం వాడీవేడిగా సాగింది. సాగు నీటి కాలువలను నిర్లక్ష్యం చేస్తున్న నీటిపారుదలశాఖ అధికారులపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమైన సమావేశాలు తన నియోజకవర్గంలో జరుగుతున్నా తనకు సమాచారం ఇవ్వడంలేదని అధికారుల తీరుపై ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అసహనం వ్యక్తం చేశారు. బుడమేరులో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆధారాలు చూపినా అడ్డుకోవడం లేదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ సమస్యలు సభ దృష్టికి తెచ్చారు.

'నిర్లక్ష్యమేల..

వాడీవేడిగా జిల్లా సమీక్ష సమావేశం

- సాగునీటి కాలువలపై ఎస్ఈని నిలదీసిన మంత్రి రవీంద్ర
- అధికారుల తీరు మారడంలేదన్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ
- ఆధారాలు చూపినా మట్టి తవ్వకాలు ఆపడం లేదన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు
- పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చిన ప్రజాప్రతినిధులు
- అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తే నిధులు తెస్తామన్న మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ తదితరులు (ఇన్‌సెట్‌లో) సమావేశంలో పాల్గొన్న శాసనసభ్యులు, అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. వివిధ శాఖలపై లోతుగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఉపయోగపడే పనులకు సంబంధించి పూర్తిస్థాయిలో నివేదికలు అందిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతానని చెప్పారు. అభివృద్ధి పనుల్లో, తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ నేతృత్వంలో జిల్లా మరింతగా అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడకుండా పంట కాలువలు, డ్రెయినేజీలకు త్వరితగతిన మరమ్మతులు చేయించాలన్నారు.

అధికారుల తీరు మారాల్సిందే! : ప్రభుత్వ విప్ యార్లగడ్డ

జిల్లాలోని అధికారులు పనితీరు మార్చుకోవాలని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మే 2వతేదీన ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన సమావేశాలను గన్నవరంలో నిర్వహిస్తున్న అధికారులు స్థానిక శాసన సభ్యుడినైన తనకు కనీస సమాచారం ఇవ్వడంలేదన్నారు. కేసరపల్లి, గన్నవరంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయనే అంశంపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వాటిని ఏ కారణంతో అధికారులు స్వాధీనం చేసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. గన్నవరం ఎయిర్‌పోర్టు కృష్ణాజిల్లాలోనే ఉంటే ఎన్టీఆర్ జిల్లా అధికారుల పాలన అక్కడ ఎందుకు కొనసాగిస్తున్నారని నిలదీశారు. ఎయిర్‌పోర్టు నుంచి వస్తుంటే కేసరపల్లి వద్ద రెండు వంతెనలకు రెయిలింగ్ కూడా లేకుండా వెక్కిరిస్తూ కనపడుతున్నాయని, వీఐపీలు ఈ వంతెనల స్థితిని చూసి ఏమనుకుంటారని ప్రశ్నించారు. జిల్లాకు సాగునీరు ఏ తేదీన విడుదల చేస్తారో, కాలువల మరమ్మతులు ఎప్పుడు పూర్తి చేస్తారో అధికారులే చెప్పాలని అన్నారు. ఏలూరుపాడు వద్ద పంట కాలువ గట్టు బలహీనంగా ఉందని, పెరికీడు వద్ద కాలువలో పూడికతీత పనులు చేయాలని, ఎప్పటిలోగా చేస్తారని ఆయన ప్రశ్నించారు. గన్నవరం నియోజకవర్గంలోని 54 మిగతా 6లో..

క్షేత్రస్థాయిలో పర్యటించరా!

నీటిపారుదలశాఖ ఎస్ఈపై మంత్రి రవీంద్ర ఆగ్రహం

నీటి పారుదలశాఖపై జరిగిన సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర నీటి పారుదలశాఖ ఎస్ఈపై ప్రశ్నల వర్షం కురిపించారు. కాలువల పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పర్యటించకుండా విజయవాడకే పరిమితమైతే ఎలాగని ప్రశ్నించారు. బందరు కాలువకు కంకిపాడు వద్ద లాకులు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాడపాలెం, బంటుమిల్లి తదితర ప్రాంతాల్లో పంట కాలువలు, డ్రెయినేజీలను పరిశీలించారా.. ఎన్ని ప్రాంతాల్లో పర్యటించారు.. ఏం గమనించారో చెప్పాలని మంత్రి నిలదీశారు. కాలువల నిర్వహణ పనులు చేసే కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై పనులు చేయకుండానే బిల్లులు చేసేస్తున్నారని ఆరోపించారు. బందరు మండలం చిన్నాపురం సమీపంలో గుండేరు డ్రెయిన్‌పై ఉన్న పాతవంతెన కూలిపోవడంతో అక్కడ గుర్రపుడెక్క, నాచు పేరుకుపోయి నీటి ప్రవాహం నిలిచిపోతోందన్నారు. ఎగువ ప్రాంతంలోని పొలాలు భవిష్యత్తులో మునిగిపోతే అధికారులే బాధ్యత వహించాలని చెప్పారు. జూన్ నెలాఖరులోగా పంట కాలువలు, డ్రెయినేజీలలో పూడికతీత పనులు చేయాలని, ఇందుకు అవసరమై నివేదికలను తయారు చేస్తే, అదనంగా నిధులు కావాల్సివస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తాను వెళ్లి నిధులు విడుదల చేయాలని కోరతానని మంత్రి కొల్లు వివరించారు.

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగిన వారు విజయవాడలో ఉంటున్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు తెలుస్తోంది. ప్రస్తుతం పది మంది అనుమానితులను నిఘా వర్గాలు గుర్తించినట్టు సమాచారం. వారి కార్యకలాపాలపై నిరంతర నిఘాను కొనసాగిస్తున్నట్టు తెలిసింది.


బెజవాడలో.. 'ఉగ్ర కదలికలు!

- ఒకప్పుడు నక్సల్స్, తర్వాత మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా బెజవాడ
- నాటి నుంచి నేటి వరకు హింసాత్మక ఘటనలకు దూరంగా నగరం

'సిమి'తో సంబంధాలపై కేంద్ర నిఘా వర్గాల సమాచారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగి ఉన్నారన్న అనుమానంతో బెజవాడలో నిఘా వర్గాలు జల్లెడ పట్టి కేంద్ర నిఘా సంస్థలకు నివేదిక ఇవ్వటం సంచలనం సృష్టిస్తోంది. సరిగ్గా రెండు నెలల కిందటే ఢిల్లీలోని నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారం విజయవాడ పోలీసులను అప్రమత్తం చేసింది. సిమీ సంస్థతో సంబంధాలు కలిగిన వారు విజయవాడలో షెల్టర్ ఏర్పాటు చేసుకుని ఉంటున్నారని కేంద్ర నిఘా వర్గాలు సమాచారాన్ని అందించినట్టు తెలిసింది. సిమి సంస్థతో సంబంధాలు కలిగిన వారుగా అనుమానిస్తున్న వారి కదలికలపై స్థానిక నిఘా వర్గాలు దృష్టి సారించాయి. దాదాపుగా నెల రోజుల పరిశీలన అనంతరం విజయవాడ నగరంలో నలుగురు, నగర శివారు ప్రాంతాలలో మరో ఆరుగురిని అనుమానితులుగా గుర్తించినట్టు తెలుస్తోంది. ఈ పది మందికి సంబంధించిన సమాచారాన్ని విజయవాడ నిఘా వర్గాలు కేంద్ర నిఘా సంస్థలకు అందించాయి. నెల రోజుల కిందటే ఈ సమాచారాన్ని ఇచ్చాయి. ఈ ప్రక్రియ అంతా కూడా అత్యంత రహస్యంగా జరగటం విశేషం. అయితే గుర్తించిన అనుమానితులను సిమీ ఉగ్రవాదులేనని ఇతిమిద్దంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతానికి వీరంతా అనుమానితులుగానే ఉన్నారు. వీరి కదలికలపై అయితే నిరంతరాయంగా నిఘా కొనసాగుతోంది.

- 10 మంది అనుమానితుల గుర్తింపు.. వారి కదలికలపై నిఘా
- విజయవాడలో నలుగురు.. శివారు ప్రాంతాల్లో మరో ఆరుగురు
- ఏసీ మెకానిక్‌లు, మసీదుల దగ్గర భిక్షాటన, బడ్డీకొట్లలో పనులు



అనుమానాస్పద వ్యక్తులపై నిఘా

కేంద్ర నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో స్థానిక నిఘా వర్గాల పరిశీలనలో నగరంలోని పంజా సెంటర్, లబ్బీపేట, అశోక్‌నగర్‌లలో అనుమానాస్పద వ్యక్తులు ఉన్నట్టు తెలుస్తోంది. గొల్లపూడిలో కూడా కొందరు అనుమానిత వ్యక్తులు ఉన్నారని సమాచారం. విజయవాడ నగరంలో నలుగురు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించారు. మిగిలిన ఆరుగురిలో గొల్లపూడిలో ఇద్దరు, పేరు బయటకు రాని శివారు ప్రాంతాలలో మరో నలుగురు ఉంటున్నారని తెలుస్తోంది. అనుమానితుల గురించిన సమాచారం కూడా ఆసక్తిని కలిగిస్తోంది. ఒక్కొక్కరూ ఒక్కో వృత్తి చేస్తున్నారు. ఒకరిద్దరు మసీదుల దగ్గర భిక్షాటన చేస్తుండగా.. ఇద్దరు ఏసీ మెకానిక్‌లుగా పనిచేస్తున్నారని మిగతా 6లో..

● ఉగ్రదాడిపై కొవ్వొత్తుల నిరసన



జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ విజయవాడలోని సిద్ధార్థ కాలేజీ సర్కిల్ మదర్ థెరిసా విగ్రహం వద్ద గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్తాన్ దేశ దిష్టిబొమ్మను దహనం చేశారు. మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎండీ ఫరూఖ్ మాట్లాడుతూ పాకిస్తాన్ రచించిన విద్వేషపూరిత వ్యూహంలో అమాయకులైన భారత ముస్లింలు పావులుగా మారొద్దని హితవు పలికారు.

అధికారులపై క్రమశిక్షణ చర్యలు!

రోడ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంపై ప్రభుత్వ ఆదేశం

- జగ్గయ్యపేట ధనంబోడు ఇందిరమ్మ కాలనీలో రూ.కోటితో రోడ్ల నిర్మాణం
- రోడ్లు నాణ్యతగా లేవని కాలనీ వాసుల ఫిర్యాదు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలో ధనంబోడు ఇందిరమ్మ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిం చిన పురపాలక సంఘం పూర్వ ఏఈ డి.హనుమంతురావు, పర్యవేక్షణ అధికారులు డీఈ వీవీ కోటేశ్వర రావు, ఈఈ భూషణంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీసీఏ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలో నివేదిక ఇచ్చేందుకు సీఆర్డీఏ సీఈ శ్రీనివాసులను నియమించి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయలు వెచ్చించి ధనంబోడు ఇందిరమ్మ కాలనీలో 2023లో అంతర్గత సిమెంట్ రోడ్లు వేశారు. థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు చేసి సంతృప్తి వ్యక్తం చేసింది. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని కాలనీవాసులు ఫిర్యాదుతో విజిలెన్స్ విచారణ జరిగింది. రోడ్ల నిర్మాణంలో కనీస ప్రమాణాలు పాటించలేదని తేల్చింది. ఇందుకు బాధ్యులైన ఏఈ హనుమంతురావు, డీఈ వీవీ కోటేశ్వరరావు, విజయవాడ ఈఈ భూషణంపై చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఆ నివేదికను తొక్కిపెట్టి ఆ అధికారులను జగ్గయ్య పేటలో కొనసాగించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో ఇది మళ్లీ వెలుగులోకి వచ్చింది. కౌన్సిల్ వైసీపీ నుంచి తెలుగు దేశం వశం కావటం, అధికారులను బదిలీ చేశారు. ఇప్పుడు క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేసింది.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి
6లో

కూచిపూడి ఎంపీపీ పరీక్షలు ప్రారంభం
6లో

యూనియన్ ప్రతిష్టను దెబ్బతీస్తారా!
- వ్యక్తిగత ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం
- కృష్ణా మిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు
6లో

కార్యకర్తలకు అండగా ఉంటాం

ప్రతి నెలా మొదటి శుక్రవారం అవనిగడ్డకు కేటాయిస్తా

- అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన
- రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్

చల్లపల్లి/అవనిగడ్డ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటాం.. అవనిగడ్డలో టీడీపీ ఎమ్మెల్యే లేకపోవటంతో ప్రతి నెలా మొదటి శుక్రవారం నియోజకవర్గానికి కేటాయిస్తానని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. చల్లపల్లి శారదా గ్రాండియర్ ఫంక్షన్ హాలులో అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం గురువారం సాయంత్రం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ఏర్పాటులో భాగంగా అవనిగడ్డ స్థానాన్ని జనసేనకు కేటాయించగా, కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేసిన పార్టీ నేతలు, కార్యకర్తలను కలుస్తానని తెలిపారు. ఇంకా 85శాతం పదవుల నియామకాలు జరగాల్సి ఉందని, నాయకులు నిరుత్సాహం చెందవద్దన్నారు. కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తీసుకుంటానని, ప్రతి టీడీపీ కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కుటుంబ సాధికార సభ్యుల నియామక ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా రాష్ట్రంలో కూటమి పరిపాలన సాగుతోందని వివరించారు. ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ టీడీపీ సంస్థాగత కార్యక్రమాలు పూర్తిచేయాలన్నారు. నియోజకవర్గానికి ఇన్‌చార్జిని నియమించేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోందని, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినా ఏ పనీ అవటంలేదనే బాధ గ్రామస్థాయిలో ఉన్నమాట వాస్తవమన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని ఇన్‌చార్జిగా నియమిస్తారని తెలిపారు.



నాయకులకు టీడీపీ సభ్యత్వ కార్డులు అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, పరిశీలకులు కనపర్తి తదితరులు

మా మాటకు విలువలేదు

ఈ సమావేశంలో పలువురు సీనియర్ నేతలు గడిచిన పది నెలల కాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తల మాటకు విలువ ఉండటం లేదన్నారు. నాగాయలంక, మిగతా 6లో..

బీసెంట్ రోడ్డులో అనధికార వ్యాపారులను గుర్తించండి
8లో

నావికాదళంతో కేయూ ఒప్పందం
8లో

అమ్మో 350..!



- డొక్కు బస్సులతో ప్రయాణికులకు తప్పనితిప్పలు
- ఈ నెంబరు బస్ పైకి హైటెక్.. లోపలంతా డొల్ల
- ప్రజాదరణ కోల్పోతున్న ఆర్టీసీ బస్సులు

8లో



ధర్నాచౌక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ప్రొవైడర్ల ఆందోళన

సమస్యలు పరిష్కరించండి

» నేషనల్ హెల్త్ మిషన్ కమ్యూనిటీ ఆఫీసర్ల ధర్నా

ధర్నాచౌక్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారానికి నేషనల్ హెల్త్ మిషన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం చేపట్టిన ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ప్రొవైడర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎంసీఏ రాష్ట్ర కార్యదర్శి సందీప్‌కుమార్ మాట్లాడుతూ, వైద్య, ఆరోగ్యశాఖలోని ఎన్‌హెచ్ఎం కింద సీహెచ్‌వోలుగా విధులు నిర్వర్తిస్తున్న వారు గత రెండేళ్ల నుంచి జీతభత్యాల అంశంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్లు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీనెల వేతానలతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతీ ఏడాది 5 శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించి, క్రమబద్ధీకరించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, స్టేట్ కో-ఆర్డినేటర్ వినోద్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

డీఎస్సీలో వెయిటేజి మార్కులు కలపాలి

» వయో పరిమితి 47 ఏళ్లకు పెంచాలి : ఏఐవైఎఫ్

ధర్నాచౌక్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు ఈవెంట్స్‌కు వెయిటేజ్ మార్కులు కలపాలని, డీఎస్సీ అభ్యర్థులకు వయో పరిమితి 47 ఏళ్లకు పెంచాలని ఏఐవైఎఫ్ నేతలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో గరువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి దేవేంద్ర మాట్లాడారు. డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు, ఈవెంట్స్‌కు 30 శాతం వెయిటేజ్ మార్కులు కలపాలన్నారు. స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉండగా కేవలం 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయ పోస్టుల్లో క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. నిరుద్యోగ పోరాట జేఏసీ కన్వీనర్ లంకా గోవిందరాజులు, నరసింహులు, వెంకటేశ్వర్లు, మధు, చెల్లయ్య, వెంకట్, సుధాకర్, గంట మమత తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ నుంచి అవార్డు అందుకుంటున్న స్వరూపరాణి

గొల్లపూడి పంచాయతీకి జాతీయ పురస్కారం

» ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు

గొల్లపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి పంచాయతీకి జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఆత్మనిర్భార్ పంచాయతీ ప్రత్యేక అవార్డు కేటగిరిలో 2025కు గొల్లపూడి పంచాయతీకి అవార్డు లభించింది. ప్రజల్లో చైతన్యం నింపి సొంత నిధులతో పంచాయతీని అభివృద్ధి చేసినందుకు ఈ అవార్డు లభించింది. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్‌లోని మధుబానిలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా గొల్లపూడి పంచాయతీ కార్యదర్శి ఎం.స్వరూపరాణి, పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ సుధాకర్‌లు అవార్డు అందుకున్నారు.

ఎఫ్ఏకు అవార్డు



పవన్ కల్యాణ్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎఫ్ఏ పద్మ

జి.కొండూరు : జి.కొండూరు మండలం కందులపాడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) కంచర్ల పద్మకు అవార్డు దక్కింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని ఎఫ్ఏ కన్వెన్షన్ హాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా పద్మ అవార్డు అందుకుంది. ఈమేరకు పద్మను కందులపాడు గ్రామ సర్పంచ్ నెల్లూరు శ్రీదేవి, టీడీపీ నాయకులు నెల్లూరు లీలా శ్రీనివాసరావులు ప్రత్యేకంగా అభినందించారు.



ప్రాక్టికల్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థిని

కూచిపూడి ఎంపీఏ పరీక్షలు ప్రారంభం

కూచిపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో ఎంపీఏ ద్వితీయ సంవత్సరం నాట్య (ప్రాక్టికల్) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కళాపములు, యక్షగానం అంశాలపై పరీక్షలు జరగ్గా, పరీక్షల నిర్వాహకులుగా నాట్యాచార్యులు హరిరామమూర్తి, పసుమర్తి రత్తయ్య శర్మ, చీఫ్ సూపరింటెండెంట్‌గా చింతా రవిబాలకృష్ణ వ్యవహరించారు. నట్టువాంగం యేశ్వరపు శ్రీనివాసులు, గాత్రం వెంకట దుర్గా భవాని, మృదంగం హరనాథ శాస్త్రి సహకరించారు.

దేశ అభివృద్ధి, ప్రజల ఐక్యత చూసి ఓర్వలేకే..

ఉగ్ర దాడులు!

నిరసనగా కృష్ణా మిల్క్ ప్రాజెక్టు ఆవరణలో మానవహారం



ఉగ్రదాడులను ఖండిస్తూ నిరసన తెలుపుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చలసాని ఆంజనేయులు, తదితరులు

» మృతుల కుటుంబాలకు ప్రజలందరూ అండగా ఉంటారు : ఎంపీ కేశినేని చిన్ని

» ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం : యూనియన్ ఛైర్మన్ చలసాని

చిట్టినగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ ప్రజల ఐక్యత, దేశాభివృద్ధి చూసి ఓర్వలేక పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడ్డారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ) ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ మిల్క్‌ఫ్యాక్టరీలో పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మానవహారం నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలి.. దోషులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ ఆధ్వర్యంలోనే దాడి జరిగిందని భారతదేశం గట్టిగా విశ్వసిస్తున్నదన్నారు. ఉగ్రదాడిలో అమాయకులు చనిపోవడం దేశ ప్రజలందరినీ కలచివేసిందన్నారు. కుల మతాలకు అతీతంగా దేశ ప్రజలతో పాటు కాశ్మీర్ ప్రాంత ప్రజలు కూడా శాంతినే కోరుకుంటూ దాడిని ఖండించారన్నారు. ఇటువంటి దాడులు చేసి దేశప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరన్నారు. సైనిక దుస్తుల్లో వచ్చి దాడులకు పాల్పడిన దోషులను త్వరలోనే పట్టుకుని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు దేశ ప్రజలందరూ అండగా ఉంటారన్నారు. దాడుల్లో గాయపడిన వారికి సానుభూతి, మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. వారిపవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కృష్ణాజిల్లా మిల్క్‌యూనియన్ (విజయ) ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించేలా దాడికి తెగబడిన ఉగ్రవాదుల పట్ల కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. భారతదేశంలో శాంతికి విఘాతం కలిగించాలని చూస్తున్న పాకిస్తాన్ దుశ్చర్యలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఉగ్రదాడుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మృతుల కుటుంబాలకు యూనియన్ తరపున ఒక్కో కుటుంబానికి రూ. లక్షన్నర చొప్పున అందజేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి ఫతావుల్లా, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ఆషా, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సొలంకిరాజు, పశ్చిమనియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుకాశి సరిత, తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, బీసీ సెల్ అధ్యక్షుడు నమ్మిభాను ప్రకాష్, రాష్ట్ర నాయకులు గుర్రం కొండ, క్లస్టర్ ఇన్చార్జ్‌లు యేదుపాటి రామయ్య, యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, వేమూరి సాయివెంకటరమణ, చలసాని చక్రపాణి, ఆర్జా వెంకట నగేష్, అంజిరెడ్డి, పి.కొండలరావు, రామచంద్రరావు, నెక్కలపు వాణిశ్రీ, నాని, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ ప్రతిష్టను దెబ్బతీస్తారా!

» వ్యక్తిగత ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం » కృష్ణా మిల్క్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు

చిట్టినగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా మిల్క్ యూనియన్ ప్రతిష్టను దెబ్బతీసేలా సోషల్ మీడియా వేదికగా, వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఇటీవల సోషల్ మీడియాతోపాటు ఓ పత్రికలో ప్రచురించిన కథనాలు పూర్తిగా అవాస్తవాలని పాలకవర్గ సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. గురువారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లక్షలాది మంది పాడి రైతుల సంస్థ 'కృష్ణా మిల్క్ యూనియన్' అన్నారు. ఇటీవల కొందరు తమ సొంత ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలను చేస్తూ కుట్ర పన్నుతున్నారన్నారు. ఆరోపణల్లో నిజాలు ఉంటే పాలక వర్గం ఎదుట ముఖాముఖి తెలియజేయాలన్నారు. ఆరోపణలు చేసిన వారిని పాలకవర్గంతోపాటు లక్షలాది మంది పాడి రైతులు సంఘటితంగా ఎదుర్కొంటారన్నారు. పాలకవర్గసభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు మాట్లాడుతూ, వాస్తవాలు లేకుండా అసత్య ప్రచారాలు చేస్తూ కొందరు వ్యక్తులు ఆరోపణలు చేస్తూ యూనియన్ ప్రతిష్టను దిగజారుస్తున్నారన్నారు. ఇటువంటివి పునరావృత్తం కాకుండా చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు. వేమూరి సాయి వెంకటరమణ మాట్లాడుతూ, వాట్సాప్, సోషల్ మీడియాలో ఛైర్మన్, పాలకవర్గంపై చేస్తున్న ఆరోపణలు సత్యదూరమన్నారు. ఓ వ్యక్తి యూనియన్‌కు చెల్లించాల్సిన కోట్లాది రూపాయలు కట్టకుండా ఉండేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నాడని తెలిసిందన్నారు. అలాగే ఆ వ్యక్తి కోర్టుకి వెళ్లిన కోర్టు డబ్బులు కట్టాలని చెప్పడంతో ఏం చేయలేక ఇటువంటి అసత్య ప్రచారాలు, పాలకవర్గంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. అతను ఎన్ని కుయుక్తులు పన్నినా వదిలి పెట్టేది లేదని, డబ్బులు కట్టిస్తామన్నారు. సోషల్, మీడియాతోపాటు ఓ పత్రిక ఎటువంటి ఆధారాలు లేకుండా కథనాలు ప్రచురించడం బాధాకరమన్నారు. పాలకవర్గ సభ్యురాలు నెక్కలపు వాణిశ్రీ మాట్లాడుతూ, పాలకవర్గం నిరంతరం పాడి రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, టెండర్ ఇతరత్ర పనులు అన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయన్నారు. ఛైర్మన్‌తోపాటు పాలకవర్గంపై అసత్యప్రచారాలను పాడిరైతులు, పాలకవర్గం ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎండి కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గ సభ్యులు ఆర్జా నగేష్, నాని, కొండలరావు, రామచంద్రరావు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమేల!

(5వ పేజీ తరువాయి)

పంచాయతీలలో భూమి సర్వేకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టకుంటే ఎలా? : రావి

నందివాడ మండలం చేదుర్తిపాడు సమీపంలో బుడమేరులో పూడిక తీత పేరుతో గట్టును కూడా తవ్వేస్తున్నారని, ఈ అంశంపై డ్రెయినేజీ విభాగం అధికారులకు తాను ఫిర్యాదు చేస్తే అధికారులు ఏకంగా అనుమతులే ఇచ్చారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. పూడికతీత పనులు కాలువలో చేస్తారని, అది కూడా అడుగు, అడుగున్నర లోతున మట్టిని తీస్తారని, కానీ లోతుగా కాలువలో మట్టిని తవ్వడంతోపాటు గట్టును సైతం తవ్వేసి రాత్రివేళల్లో టిప్పర్‌ల ద్వారా తరలించుకుపోతున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దయిన పనులకు గత నెల 25వతేదీన డ్రెయినేజీ అధికారులు అనుమతులు ఇస్తే, అంతకు రెండు రోజుల ముందుగానే మట్టిని తవ్వి విక్రయించే పనులను అక్రమార్కులు ప్రారంభించారన్నారు. మట్టి అక్రమ రవాణా విషయంపై ఎస్పీకి తాను పూర్తి వివరాలతో, పొటోలు కూడా పంపానని, అయినా మట్టి అక్రమ తవ్వకాలు, విక్రయాలు ఆగలేదని, ఇదేం పద్ధతని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ చేదుర్తిపాడులో మట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, సీసీ కెమెరాలతో, డ్రెయినేజీ విభాగం సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు.

కనీస సమాచారం ఇవ్వడం లేదు : వర్ల

మొవ్వ మండలంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో కట్టిన కల్యాణ మండపం ప్రారంభోత్సవ సమాచారం తనకు ఇవ్వలేదని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. నియోజకవర్గంలో నూతనంగా రహదారుల నిర్మాణం జరిగిన విషయాన్ని కూడా తనకు తెలియజేయకుండా ఆర్అండ్‌బీ అధికారులు గోప్యత పాటిస్తున్నారని చెప్పారు. పామర్రు నియోజకవర్గంలో కృష్ణానదీ గర్భంలో పలు గ్రామాలు ఉన్నాయని, నదికి భారీగా వరదలు వచ్చిన సమయంలో ప్రజలను బయటకు తీసుకువచ్చేందుకు అప్పటికపుడు పడవల ఏర్పాటు కష్టంగా మారిందని, స్థానికులకు పడవలు అందించాలని ఆయన కోరారు.

ఆక్వాజోన్ పరిధిని పెంచండి : కాగిత

గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్వాజోన్ పేరుతో రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీని గణనీయంగా తగ్గించారని, తీర ప్రాంతంలోని అన్ని రొయ్యల చెరువులను ఆక్వాజోన్ పరిధిలోకి చేర్చి విద్యుత్ రాయితీని అమలు చేయాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కొద్ది రోజుల్లోనే అన్ని రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీని అమలు చేస్తామని మంత్రులు సుభాష్, రవీంద్ర హామీ ఇచ్చారు. పంటల బీమా పథకంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను కోరారు. మొక్కజొన్న, మినుము కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఆయిల్‌పాం, ఉద్యాన పంటల సాగును పెంచేందుకు, వరికోతల సమయంలో ధాన్యం ఆరబెట్టేందుకు డ్రయ్యర్‌లను రైతులకు అందించేందుకు, వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్సీ కల్పలత, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు 1.20 లక్షల మంది!

(5వ పేజీ తరువాయి)

సమాచారం. మే 2వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

ఆరు రూట్లలో సభ వద్దకు..

గుంటూరు జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నెంబర్-4లో 200 బస్సుల ద్వారా మంగళగిరి, డాన్ బాస్కో, ఎర్రబాలెం, ఈ8, ఈ9 రోడ్ల మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు చేరుకుంటారు. రూట్ నెంబర్-5లో 200 బస్సుల ద్వారా ఎన్‌హెచ్-16, పశ్చిమ బైపాస్, నిడమర్రు, కురగల్లు, ఎన్-9 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు తరలివస్తారు. రూట్ నెంబర్-6లో మరో 200 బస్సులలో తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు, ఈ 6 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు వస్తారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నెంబర్ - 1 ద్వారా 600 బస్సులలో గొల్లపూడి, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం సర్వీసు రోడ్డు, మందడం, ఎన్ 7 రోడ్డు, ఈ 8 జంక్షన్, ఈ 8, ఎన్ 8 రోడ్ల మీదుగా పార్కింగ్-6 ప్లేస్‌కు తరలివస్తారు. పల్నాడు జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నెంబర్-6 ద్వారా 400 బస్సులలో తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు, ఈ 6 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు వస్తారు. మరో 200 బస్సులలో రూట్ నెంబర్-7 ద్వారా అమరావతి, బోరుపాలెం, రాయపూడి, హైకోర్టు రోడ్డు మీదుగా ఈ 6, ఎన్ - 10 రోడ్డు మీదుగా పార్కింగ్ - 1 ప్లేస్‌కు తరలివస్తారు. కృష్ణాజిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నెంబర్-3, 4 ద్వారా 200 బస్సులలో కనకదుర్గా వారధి, ఓటీజీ, స్క్రూ బ్రిడ్జి, నులకపేట, డాన్ బాస్కో, యర్రబాలెం, ఈ 8, ఎన్ 9 జంక్షన్ల మీదుగా పార్కింగ్ - 7 ప్లేస్‌కు వెళతారు. బాపట్ల జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నెంబర్ - 5 ద్వారా ఎన్‌హెచ్ - 16, వెస్ట్ బైపాస్, నిడమర్రు, కురగల్లు, ఎన్-9 రోడ్డు జంక్షన్ మీదుగా పార్కింగ్ - 1 ప్లేస్‌కు వస్తారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నెంబర్ - 1 ద్వారా 200 బస్సులలో గొల్లపూడి, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం, సర్వీసు రోడ్డు, మందడం, ఎన్-7 రోడ్డు, ఈ - 8 రోడ్డు మీదుగా పార్కింగ్ - 6 ప్లేస్‌కు వెళతారు.

గ్యాలరీలకు జనం ఇలా..

ఆరు రూట్లలో పార్కింగ్ ప్లేసులకు చేరుకున్న వారంతా కూడా తమకు నిర్దేశించిన విధంగా కొందరు రోడ్డు షోలో పాల్గొనటానికి, మరికొందరు గ్యాలరీలలో కూర్చోవటానికి వెళ్తారు. గుంటూరు జిల్లా నుంచి వచ్చే 30 వేల మంది పూర్తిగా గ్యాలరీలలోనే కూర్చుంటారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే 30 వేల మందిలో 5 వేల మంది రోడ్డుషో, 25 వేల మంది గ్యాలరీలకు వెళ్తారు. పల్నాడు జిల్లా నుంచి వచ్చే 30 వేల మంది కూడా గ్యాలరీలలోనే కూర్చుంటారు. కృష్ణా, బాపట్ల జిల్లాల నుంచి వచ్చే 20 వేల మంది కేవలం రోడ్డు షోకు మాత్రమే వెళతారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే 10 వేల మందిలో 5 వేల మంది రోడ్డు షోకు, మరో ఐదు వేల మంది గ్యాలరీలలోకి వెళ్తారని సమాచారం.

ప్రకాశం బ్యారేజీ మీదుగా వీఐపీ రూట్

సభా ప్రాంగణానికి వెళ్లేందుకు వీఐపీ రూట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వీఐపీ రూట్ విజయవాడలో ప్రకాశం బ్యారేజీ, కరకట్ట, వెంకటపాలెం, సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ఈ - 3, ఎన్ 9 జంక్షన్ నుంచి ఎడమవైపుగా ఈ-6, ఎన్ 9 జంక్షన్‌ను టచ్ చేస్తూ సచివాలయం పక్క నుంచి నేరుగా పీ-9 పార్కింగ్ ప్లేస్‌కు వాహనాలు వెళతాయి. ఒకవేళ అవాంతరాలు ఏమైనా ఏర్పడితే వీఐపీ ఆల్టర్‌నేటివ్ రూట్‌ను కూడా నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి జంక్షన్, ఉండవల్లి రోడ్డు మీదుగా వెంకటపాలెం వెళ్లేలా ప్లాన్ చేశారు.

కార్యకర్తలకు అండగా..

(5వ పేజీ తరువాయి)

కోడూరు మండలాల్లోని ప్రత్యేక భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో పంట పొలాల్లో మెరక తీసుకోవాలన్నా అధికారులు అనుమతించని పరిస్థితులు ఉన్నాయని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోడూరు మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఒక అడుగు ముందుకు వేసి పొత్తు ధర్మాన్ని అనుసరించి తాము పని చేస్తున్నామని, అయితే స్థానిక నాయకత్వం నుంచి మాత్రం తమకు సహకారం అందకపోగా, తాము చీత్కారాలు ఎదుర్కొంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి ఇన్‌చార్జి లేకపోవటంతోనే పార్టీ కార్యకర్తల పరిస్థితి దారుణంగా తయారైందని వెంటనే ఇన్‌చార్జిని నియమించి పార్టీని గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, ఎంపీపీలు కోట విజయ రాధిక, రావి దుర్గావాణి, టీడీపీ మండల అధ్యక్షులు బండె శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, యాసం చిట్టిబాబు, తుమ్మల చౌదరిబాబు, నడకుదిటి జనార్ధనరావు పాల్గొన్నారు.



కాలిపోయిన మొక్కజొన్న కంకులను చూపుతున్న రైతులు, టీడీపీ నేతలు

మొక్కజొన్న పంట బుగ్గిపాలు

» 20 ఎకరాల్లో కాలిపోయిన పంట

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంవల్ల గురువారం మరోసారి షార్ట్ సర్క్యూట్‌తో కొటికలపూడి గ్రామంలో మరోచోట 20 ఎకరాల్లో మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. బుధవారం జరిగిన ప్రమాదంలో 25 ఎకరాలు అగ్గికి బుగ్గయ్యి రైతులు లబోదిబోమంటున్నా మా తప్పు కాదని విద్యుత్‌శాఖ అధికారులు బుకాయించారని, అయితే గురువారం మరోమారు జరగడంతో ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగానే విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగి చేతికి వచ్చిన పంటలు కాలిపోయాయని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇబ్రహీంపట్నం ట్రాన్స్‌కో ఏఈ వెంకన్న వివరణ ఇస్తూ ఘటన జరిగిన ప్రదేశంలో ఉన్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు బాగానే ఉన్నాయని, అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. పంటను రక్షించేందుకు దాసరి చిన్న దుర్గారావు, దాసరి పెద్ద దుర్గారావులకు మంటలార్పే ప్రయత్నంలో గాయాలయ్యాయి. బాధిత రైతులకు టీడీపీ మండల అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ), టీడీపీ నేత రెంటపల్లి వెంకటేశ్వరరావులు సంఘీభావం తెలిపారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి విషయాన్ని రైతులు తీసుకెళ్లగా న్యాయం చేయిస్తామని చెప్పారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి గోపి

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

» కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

మచిలీపట్నం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని కోర్టుల్లో మే10న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి జి.గోపి అన్నారు. జిల్లాకోర్టు న్యాయసేవాధికార సదన్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా లోక్‌అదాలత్ కార్యక్రమంలో అధికంగా కేసులు పరిష్కారమయ్యేలా, జిల్లా ప్రథమస్థానంలో నిలిచేలా అన్ని విభాగాల అధికారులు సహకరించాలని ఆయన కోరారు. పోలీస్‌స్టేషన్ల వారీగా సర్కిల్ కమిటీలను ఏర్పాటుచేసి అధికసంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, న్యాయమూర్తులు పాండురంగారెడ్డి, సుజాత, ఏఎస్పీ వీవీ నాయుడు, కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెజవాడలో.. ఉగ్ర కదలికలు!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తోంది. మసీదుల దగ్గర బడ్డీకొట్లలో కూడా ఉంటున్నారని సమాచారం. వీరి కదలికలపై ఇప్పటికీ నిఘా కొనసాగుతూనే ఉంది. స్థానిక నిఘా వర్గాలు ఇప్పటికే వీరి కదలికలపై నిఘా వేశాయి. విజయవాడ నగరం షెల్టర్ జోన్‌గా ఉందన్నది కేంద్ర నిఘా సంస్థలు అభిప్రాయపడుతున్నట్టు తెలుస్తోంది. అనుమానితులుగా గుర్తించిన పది మందిపైనా గత నెల రోజులుగా నిఘా కొనసాగుతూనే ఉంది.

ఒకప్పుడు మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా..

విజయవాడ నగరం పూర్వం నుంచి నక్సల్స్, ఆ తర్వాత మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉందనేది నిఘా వర్గాల సమాచారం. నాటి పాతతరం నాయకుల నుంచి నేటి తరం నాయకుల వరకు కూడా విజయవాడలో రాకపోకలు ఉన్నా హింసాత్మక ఘటనలు మాత్రం ఇక్కడ జరగలేదు. విజయవాడతో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఒకప్పటి పీపుల్స్ వార్ గ్రూప్ నేత కొండపల్లి సీతారామయ్య కదలికలు ఉన్నాయి. ఆయనకు ప్రతి గ్రామంలోనూ సానుభూతిపరులు ఉండేవారు. అనేక గ్రామాల్లో ఆయన పర్యటించారు. 2006లో నక్సల్స్‌కు అత్యాధునిక రాకెట్ లాంచర్స్ వంటి ఆయుధాలు సమకూర్చుకునే శక్తి వచ్చిందన్నది వెలుగు చూసింది. విజయవాడకు ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వెహికల్‌లో పెద్ద ఎత్తున రాకెట్ లాంచర్ల విడిభాగాలు వచ్చాయి. విడి భాగాలు రవాణా కావటంతో ఆ సంస్థకు అనుమానం రాలేదు. వచ్చిన సరుకును తీసుకువెళ్లే విషయంలో జాప్యం జరిగింది. ఆర్డర్ ఎవరు తీసుకుంటారన్నది తెలియకపోవటంతో అలాగే ఉంచేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు పోలీసులకు సమాచారం రావటం, పరిశీలిస్తే వందలాది సంఖ్యలో రాకెట్ లాంచర్ల విడిభాగాలను గుర్తించారు. ఇది అప్పట్లో పెనుసంచలనం సృష్టించింది. దీంతో విజయవాడను తరచూ నక్సల్స్ (అప్పట్లో) షెల్టర్ జోన్‌గా ఉపయోగించుకుంటున్నారన్న అనుమానాలను పోలీసులు సైతం వ్యక్తం చేశారు. ఆ తర్వాత పలు సంఘటనలు కూడా జరిగాయి. రాకెట్ లాంచర్ల వ్యవహారంలో పాత్ర ఉందన్న కారణంతో సీపీఐ మావోయిస్టు మద్దతుదారు అయిన కోట ఆనంద్ అలియాస్ కిషోర్‌ను అరెస్టు చేయటం సంచలనం సృష్టించింది. రాకెట్ లాంచర్లు అమర్చటంలో స్పెషలిస్ట్ అయిన టెక్ మధుకు కోట ఆనంద్ స్నేహితుడన్న అనుమానంతో అరెస్టు చేశారు. విజయవాడతో తొలుత నక్సల్స్, పీపుల్స్‌వార్ గ్రూప్ ఆ తర్వాత మావోయిస్టుల కదలికలనేవి ముడిపడి ఉన్నాయి. మావోయిస్టులకు ఏ విధంగా షెల్టర్‌జోన్‌గా ఉందో అదే తరహాలో ఉగ్రవాద సంస్థల సభ్యులకు కూడా షెల్టర్ జోన్‌గా ఉంటుందన్న అనుమానాలు ఎప్పటి నుంచో ఉన్నాయి.

కొనసాగుతున్న ఇస్లామిక్ ధార్మిక సంస్థల కార్యకలాపాలు

విజయవాడ నగరంలో ఇస్లామిక్ ధార్మిక సంస్థల కార్యకలాపాలు నాటి నుంచి కొనసాగుతున్నాయి. అవన్నీ కూడా పూర్తిగా ధార్మిక, సేవా కార్యక్రమాలకే తప్ప ఉగ్రవాద కార్యకలాపాలను ప్రేరేపించినట్టు కానీ, నిర్వహిస్తున్నట్టు కానీ ఏనాడు జరగలేదు. అంజుమన్ ఏ ఇస్లామియా, జమాత్ ఏ ఇస్లామియా వంటి సంస్థలు సేవా, ధార్మికకార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఉగ్రదాడికి నిరసనగా జంక్షన్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల చేసిన దాడిని ఖండిస్తూ జంక్షన్‌లో జనసేన ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు చేతప ట్టుకుని నాలుగు రోడ్లలో ప్రదర్శన చేశారు. ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి సంతాపాన్ని తెలిపారు. జనసేన మం డల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అహమ్మద్, బీజేపీ జిల్లా నాయకుడు తోట మురళీధర్, వీరమహిళలు సింగవరపు సూర్యవతి, జయరాణి, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయం

ఉంగుటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.

మండలంలోని ఇందుపల్లి, మానికొండ గ్రామపంచాయతీల పరిధిలో సుమారు రూ.1.31కోట్లవ్యయంతో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్ల తోపాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, నీటికొరత తీర్చేందుకు రెండుచేతి పంపులు నిర్మించాలని ఇందుపల్లి గ్రామస్థులు కోరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జంధ్యాలవారి కండ్రిక రోడ్డులో విద్యుత్‌తీగలు చేతికి తగులుతున్నాయని, వెంకట్రామాపురంలో విద్యుత్ స్తంభాలు పడిపోయేలా ఉన్నాయని స్థానికుల ఫిర్యాదుపై స్పందించిన యార్లగడ్డ వారంరోజుల్లో సరిచేయాలని విద్యుత్‌శాఖాధికారులను ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.22కోట్ల ఉపాధినిధులు వస్తే ఇందుపల్లికి రూ.91లక్షలు కేటాయించానని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన ఇందుపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, తహసీల్దార్ జె.విమలకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు, పీఆర్ డీఈఈ టి.శ్రీనివాసరావు, ఏఈఈ జి.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, ఏవో హరీష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్రవంతి, విద్యుత్‌శాఖ ఏఈ ఏ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఇందుపల్లిలో సీసీరోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఎమ్మెల్యే పల్లె నిద్ర నేడు

గన్నవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శుక్రవారం రాత్రి గన్నవరంలో పల్లె నిద్ర చేస్తారని తహసీల్దారు కేవీ శివయ్య తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ అలయ కల్యాణ వేదికలో పల్లె నిద్ర చేసి శనివారం ఉదయం ఆలయంతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తారని తెలిపారు. అనంతరం జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలను పరిశీలించి ప్రభుత్వ ఆస్పత్రికి వెళతారన్నారు. అక్కడ రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీస్తారన్నారు. అక్కడ నుంచి అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తారని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

మండలంలో 60 వితంతు పింఛన్లు

ఉయ్యూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 60 వితంతు పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ఏదైనా పింఛన్ తీసుకుంటూ మరణించిన పురుషుల పెన్షన్లను వారి జీవిత భాగస్వామికి వితంతు పెన్షన్ కింద మే నుంచి అందిస్తామని తెలిపారు. ఆకునూరులో 5, బోళ్లపాడులో 5, గండిగుంటలో 10, కడవకొల్లులో 11, కలవపాములలో 8, కాటూరులో 13, ముదునూరులో 8 పింఛన్లు అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో మండలం ప్రథమ స్థానం సాధించిన రంగన్నగూడేనికి చెందిన దేవరకొండ హేమంత్‌సాయికుమార్‌ను ఎస్‌ఎస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అభినందించి, రూ.5వేల నగదు పురస్కారాన్ని అం దించారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి అధ్యక్షతన నిర్వహించిన అభినందన కార్యక్రమంలో తుమ్మల దశరథరామయ్య, రాంబాబు, వీర్ల సుబ్బయ్య, దేవరకొండ గణేష్, విద్యార్థి తల్లిదండ్రులు వెంకట సుబ్బయ్య, మాణిక్యం పాల్గొన్నారు.



పోరంకిలో సామూహిక సీమంతం కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దంపతులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పెనమలూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బిడ్డలు ఆరోగ్యంగా పుట్టడానికి గర్భవతులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. గురువారం పోరంకిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో తన సతీమణి హేమచౌదరితో కలిసి ఆయన పాల్గొన్నారు. బిడ్డ గర్భంలో ఉన్నప్పుడే తల్లి అన్ని జాగ్రత్తలు పాటించాలని, ప్రసవం తర్వాత షెడ్యూలు ప్రకారం టీకాలు వేయించాలని ఎమ్మెల్యే సూచించారు. గర్భవతులకు దుస్తులు, గాజులు, పండ్లు, స్వీట్లు, పసుపుకుంకుమలను టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు అందించారు. గర్భవతులను బోడె దంపతులు, అనుమోలు ప్రభాకరరావు, లక్ష్మి దంపతులు ఆశీర్వదించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గుణదల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం పెరగనుందని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీఎంఎస్ఎంఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్ బాబు సూచించారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ ఈడీపీపై ఎలీప్ ఇండియా నిర్వహించిన శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో ఫుడ్‌ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అందులోనూ మహిళా పారిశ్రామికవేత్తలకు మరిన్ని ప్రోత్సాహకాలు ఉన్నాయన్నారు. కంపెనీ నడిపే విధానం, లైసెన్ తెచ్చుకోవడం, బ్యాంకులను అప్రోచ్ అవడం, రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి మహిళ ఒక పరిశ్రమ స్థాపించే స్థాయికి ఎదగాలని సూచించారు. శిక్షణ తరగతులకు 23మంది మహిళా ఔత్సాహికులు హాజరయ్యారు. ఎలీప్ సంస్థ రీజినల్ అధికారి సునీత, రీజినల్ మేనేజర్ బాల పాల్గొన్నారు.



ధ్వంసమైన రోడ్డును పరిశీలించిన అధికారులు

ఉంగుటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక పూర్తిగా ధ్వంసమైన వేమండ-కలవపాముల రోడ్డును పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశించినా బాగుపడని రోడ్డు అనే శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైన నేపథ్యంలో స్పందించిన పంచాయతీరాజ్ డీఈఈ టి.శ్రీనివాసరావు, ఏఈఈ జి.శ్రీనివాస్ గురువారం వేమండ గ్రామస్తులు, టీడీపీ నాయకులతో కలిసి రహదారిని పరిశీలించారు. పీఆర్ డీఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలమేరకు రహదారి మొత్తం విస్తీర్ణం కొలిచి నిర్మాణ వ్యయంతో కూడిన అంచనాలు రూపొందించి ప్రతిపాదనలతో కూడిన నివేదికను కలెక్టర్ డీకే బాలాజీ, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ వ్యయం సుమారు 1.70కోట్లుగా అంచనా వేసినట్లు తెలిపారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు తోట నాగభూషణం, నాయకులు హనుమోలు జనార్దనరావు, ఉప సర్పంచ్ నరిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గన్నవరం ప్రధాన సెంటర్ ప్రక్షాళన

- ఆక్రమణలు తొలగించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన దుకాణాల యజమానులు



గన్నవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గన్నవరం ప్రధాన సెంటర్ ప్రక్షాళన పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారికి అనుకుని ఉన్న సెంటర్ ఆధునీకరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఒకరు ఇద్దరు మినహా దుకాణదారులందరూ స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించారు. గాంధీ విగ్రహాన్ని తొలగించి అదే చోట కొత్త గాంధీ కాంస్య విగ్రహాన్ని, ఎన్టీఆర్ విగ్రహం చోట మరో కొత్త విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. గన్నవరం సెంటర్‌కు కొత్త లుక్ తీసుకొచ్చేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విశేష కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ఆక్రమణలో ఉన్న దుకాణదారులందరికీ ముందుగానే నోటీసులు ఇచ్చి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. సెంటర్‌లో రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఆక్రమణలు తొలగించటంతో విశాలవంతమైన రోడ్డు ఉంటుందని ప్రయాణికులకు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు తెలిపారు. ఆక్రమణలు తొలగించి తమ వ్యాపారాలను దెబ్బతీయొద్దని రోడ్డు వెంబడి ఆక్రమణలో ఉన్న చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

సర్పంచ్ రమణ పూడికతీత పనుల పరిశీలన

కంకిపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కంకిపాడులో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని సర్పంచ్ బాకి రమణ అన్నారు. ప్రధాన డ్రెయినేజీలో పూడికతీత పనులను గురువారం సర్పంచ్ పర్యవేక్షించారు. ఇప్పటికే ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రూ.3 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో డ్రెయినేజీ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, కార్యదర్శి శివ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, బాకి రాజు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పరిపాలన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించినపుడే పంచాయతీరాజ్ వ్యవస్థ లక్ష్యం నెరవేరుతుందని డిప్యూటీ ఎంపీడీవో కె.లక్ష్మయ్య అన్నారు. బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. సభలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మయ్య, జడ్పీటీసీ సభ్యురాలు కె.గంగాభవాని, కార్యాలయం ఏవో త్రినాద్, పీఆర్ ఏఈ జయరాజు తదితరులు ప్రసంగించారు. పంచాయతీ కార్మికులు, మండల పరిషత్ సిబ్బందిని సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** పంచాయతీలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా ఎదగాలని ఎస్‌ఎస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రంగామణితో కలిసి మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఆయన నివాళులర్పించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారంతో చేసిన అభివృద్ధి పనులను సర్పంచ్ కసుకుర్తి రంగామణి వివరించారు. రంగన్నగూడెం లింకు రహదారులకు పీఎంజీఎస్‌వై నిధులు మంజూరు చేయాలని, దళిత వాడలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించాలని తీర్మానాలను ఆమోదించి అధికారులకు అందజేశారు. పంచాయితీ కార్యదర్శి పద్మ, పాల సొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు, పీఎసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల దశరథరామయ్య పాల్గొన్నారు. బొమ్ములూరులో సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, దంటగుంట్లలో సర్పంచ్ యజ్ఞవరపు వెంకట రంగారావు, వీరవల్లిలో సర్పంచ్ పిల్లా అనిత ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభలు నిర్వహించారు.



కుంభాభిషేకం ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి

కుంభాభిషేకం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

విజయవాడ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నున్న గ్రామంలోని ఐదు వందల ఏళ్లనాటి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మే 15 నుంచి 19 వరకు అష్టబంధన మహా సంప్రోక్షణ(కుంభాభిషేకం) నిర్వహించనున్నారు. ఆహ్వానపత్రికను దేవదాయశాఖ కార్యనిర్వహణ అధికారిణి హేమలతాదేవి గురువారం ఆలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమాల వివరాలను ఆమె వెల్లడించారు. ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైఖానస ఆగమ సంప్రదాయాన్ని అనుసరించి నిర్వహించనున్నట్టు తెలిపారు. ధర్మగిరి వేద పాఠశాలకు చెందిన పండితులు శ్రీమాన్ మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పండితులు రొంపిచర్ల శేషాచార్యులు, రొంపిచర్ల రాము, మామిళ్లపల్లి ఫణికుమార్ పాల్గొన్నారు.



ఘనంగా మహాపూర్ణాహుతి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఐదో రోజు గురువారం ఘనంగా మహాపూర్ణాహుతి హోమం, కొట్నాలు, వసంతోత్సవం, శ్రీచక్రస్నానం, ధ్వజావరోహణం, ఏకాంత సేవ, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ, తవ్వా పూర్ణచంద్రరావు, ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో అర్చక స్వాములు జరిపారు. స్వామికి ఆలయ ఈవో వై.శ్రీనివాస్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు భక్తులకు మజ్జిగ ఏర్పాటు చేశారు. సుంకర సుభాష్ చంద్ర బోస్, యలమంచిలి మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు, సీఐ సురేఖ

సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యం


హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలను సారా రహితంగా తీర్చిదిద్దుతూ అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడమే నవోదయం 2.0 కార్యక్రమ లక్ష్యమని విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు అన్నారు. కొయ్యూరులో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నాటుసారా విక్రయాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాటుసారా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నాటుసారా తయారు చేసినా, కలిగి ఉన్నా, రవాణా చేసినా చట్ట రీత్యా నేరమని అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్ కొల్లి వీర వెంకట సత్యనారాయణ, ఎక్సైజ్ సీఐ సురేఖ, ఎస్సై చందా అల్లూరయ్య, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువపై ఆక్రమణలు తొలగించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా వేలేరు గ్రామస్థులకు సాగు, తాగునీటిని అందించే చెరువులకు నీరందించే కాలువను కొందరు ఆక్రమించి అనధికారిక నిర్మాణాలు చేపడుతున్నారని, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని రైతు పొట్లూరి రవీంద్ర ఆరోపించారు. వేలేరులోని సాగునీటి చెరువులైన చిన్నమల్లంగుంట, పెద్దమల్లంగుంట, లింగం చెరువు, తాగునీటి చెరువైన ఊరు చెరువుకు కాలువ ద్వారా నీరందుతుందన్నారు. ఈ చెరువుల ద్వారా ఎస్.ఎన్.పాలెం వరకూ గల 1200ఎకరాల వరకూ వరి, మినుము పంటలను సాగు చేస్తున్నారని, ఇన్ని విధాలుగా ఉపయోగపడే సాగునీటి కాలువను కొందరు ఆక్రమించడంతో పాటు అనధికారికంగా నిర్మాణాలు చేస్తున్నారని, ఇళ్లలోని మురుగు కూడా ఈ కాలువలోకే వదులుతున్నారని ఆయన తెలిపారు. ఆక్రమణల వల్ల నీరు వదిలినా చెరువులకు నింపేందుకు వీలులేక గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి కాలువ ఆక్రమణలపై రైతులు ఇచ్చిన ఫిర్యాదు అందిందని, ఉన్నతాధికారులకు తెలియజేసి త్వరలోనే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి సురేష్ వివరణ ఇచ్చారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గన్నవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ బాల కృష్ణరావు సూచించారు. అల్లాపురంలో కేసరపల్లి పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 20 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్స చేశారు. 75 లేగదూడలు, 290 గొర్రెలు, దావాజీగూడెంలో 68 లేగదూడలు, 297 గొర్రెలు, మర్లపాలెంలో 90 లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. జలగలు, బద్దె పురుగులు, నత్తగుల్లలు, జీవాల కాలేయం, జీర్ణాశయం, చిన్నపేగు భాగాల్లో చేరి అక్కడే అంటి పెట్టుకుని రక్తాన్ని పీల్చటం వల్ల మూగజీవాల్లో రక్తహీనత వస్తుందన్నారు. తప్పనిసరిగా నట్టల నివారణ టీకాలు వేయించాలని ఆయన సూచించారు. నట్టల నివారణ టీకా వేసిన తరువాత జీవాల్లో ఎదుగుదల ఉంటుందన్నారు. ఎ అల్లాపురం సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్నబాబు, దావాజీగూడెం పాలకేంద్రం అధ్యక్షుడు గొంది నరేంద్ర, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పివిన్ కిషోర్, ప్రొఫెసర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ బిందు కిరణ్మయి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ రాధిక, డాక్టర్ దేవీప్రసాద్ పాల్గొన్నారు.



విరాళం చెక్కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

రోడ్డు నిర్మాణానికి రూ.18.55 లక్షల విరాళం

విజయవాడ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నున్న గ్రామంలోని రోడ్డు నిర్మాణానికి ఫ్యూజియన్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 18.55 లక్షల విరాళాన్ని ప్రకటించింది. రోడ్డు నిర్మాణానికి సంబంధించి చెక్కును గురువారం పంచాయితీ కార్యాలయంలో సంస్థ ప్రతినిధి భూముల సాంబశివారెడ్డి పంచాయతీ సర్పంచ్ కాటూరి సరళ, ఈవో శ్రీనివాసరావులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఎంపీపీ పాఠశాల నుంచి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ వరకు జరగనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చులో 50 శాతం ఫ్యూజియన్ ప్రాజెక్ట్ సంస్థ అందజేస్తుందని తెలియజేశారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. టీడీపీ నేతలు కలకోటి శ్రీనివాస రెడ్డి, యార్కారెడ్డి కోటిరెడ్డి, పాల్గొన్నారు.





అమ్మో 350..!

డొక్కు బస్సులతో ప్రయాణికులకు తప్పనితిప్పలు

- ఈ నెంబరు బస్ పైకి హైటెక్.. లోపలంతా డొల్ల
- ఆగుతూ.. ఊగుతూ.. మోగుతున్నాయ్..!
- డొక్కు బస్సుల కేరాఫ్‌గా ఇబ్రహీంపట్నం డిపో
- ప్రజాదరణ కోల్పోతున్న ఆర్టీసీ బస్సులు

'ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి.. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోండి' ఈ నినాదం ఇబ్రహీంపట్నం డిపోలో తిరిగే బస్సులకు వర్తించదు. ఎందుకంటే కాలం చెల్లిన బస్సులను తిప్పుతూ రోజు రోజుకు ప్రతిష్ఠ దిగజార్చుకుంటోంది. సమస్యల సుడిగుండం నుంచి డిపో ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదు. గత ఏడాది వచ్చిన వర్షాలకు డిపో పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. అందులోని బస్సులు 50 వరకు పూర్తిగా నీటిలో మునిగి ఇంజన్లలో నీరు చేరడంతో చాలా బస్సులు దెబ్బతిన్నాయి. చేసేది లేక వాటినే తిప్పుతున్నారు. పైగా డిపోలో తిరిగే బస్సుల జీవిత కాలం పూర్తయింది. వాటిస్థానంలో కొత్త బస్సులు రావాల్సి ఉన్నా రాలేదు. దీంతో కాలం చెల్లిన వాటినే తిప్పుతూ ప్రయాణికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఇబ్రహీంపట్నం డిపోలో తిప్పుతున్న బస్సులపై ప్రత్యేక కథనం

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం:

కాలం చెల్లిపోయి డొక్కు డొక్కు అయిన బస్సులకు కేరాఫ్ అడ్రస్‌గా ఇబ్రహీంపట్నం మారిపోయింది. అందుకు ఈ డిపోలో తిప్పుతున్న కాలం చెల్లిన బస్సులే ప్రత్యక్ష నిదర్శనం. ముఖ్యంగా విజయవాడ - మైలవరం మధ్య తిప్పే 350 నంబరు బస్సులకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ ఉంది. ఈ మధ్యకాలంలో వామ్మో 350వ నెంబరు బస్సులా అని ప్రయాణికులు భయపడే పరిస్థితి నెలకొంది. ఎందుకంటే బస్సులు లేక వేరే డిపోల్లో కాలం చెల్లిన హైటెక్ బస్సులను ఇక్కడకు పంపితే వాటిని 350 సర్వీసులుగా తిప్పుతున్నారు. పేరుకే అవి హైటెక్ బస్సులు లోపలంతా డొక్కు డొక్కు. సిటింగ్ వరకు పర్వాలేదు. నిలబడేందుకు మాత్రం నానాపాట్లు పడాలి. పైగా పట్టుకునేందుకు రాడ్లుండవు. నిలబడ్డ ప్రయాణికులు సీట్టను లేదా లగేజ్‌లు పెట్టుకునే టాప్‌ను పట్టుకొని ప్రమాదకర స్థితిలో నిలబడాల్సి వస్తోంది. దీంతో వాటిలో ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు ఇష్టపడటం లేదు.

వేలసంఖ్యలో ప్రయాణికులు

మైలవరం - విజయవాడ మధ్య ఇబ్రహీంపట్నం డిపో నుంచి తిప్పే ఒక్క 350 సర్వీసుల్లోనే రోజుకు వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సర్వీసు నుంచి పెద్ద ఎత్తున ఆదాయం వస్తోంది. అలాంటి సర్వీసులకు డొక్కు బస్సులు, కాలం చెల్లిన బస్సులు తిప్పడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఒకప్పుడు 350 బస్సులంటే ఎంతో క్రేజ్. ఇప్పుడు మాత్రం తిరువూరు ఆర్డినరీ నయం చార్జీ తక్కువ. పైగా 350 నంబరు బస్ కంటే ముందెళుతుందని ప్రయాణికులు ఇతర బస్సులకు మొగ్గు చూపుతున్నారు.

ఆగిపోతున్నాయి.. ఊగిపోతున్నాయి..

350వ నెంబర్ బస్సుల్లో ఒకటో ఆరో తప్ప చాలా బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. పైగా ఒకటే కర్ణ కఠోరంగా మోగిపోతున్నాయి. దీంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సుల కింద జాయింట్ రాడ్ల నుంచి భరించలేని మోత వస్తోందని, బస్సు స్పీడ్ బ్రేకర్ల వద్ద డడేల్‌మని పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. పైగా డ్రైవర్లు కూడా ఇదేం కర్మరా బాబు అనుకుంటూ బస్సులు నడేపేస్తున్నారు.


మైలవరం రూట్‌లో కొండపల్లి హెచ్‌పీ కంపెనీ వద్ద ఆగిన 350 బస్


బస్సులో పట్టుకునేందుకు రాడ్స్ లేకపోవడంతో సీట్లు పట్టుకొని నిల్చొన్న ప్రయాణికులు

బస్సు ఎక్కాలంటేనే భయం

బట్టపర్తి రవీంద్ర, జి.కొండూరు



మా రూట్‌లో 350 నంబరు బస్ ఎక్కాలంటే భయం. ఎక్కడాగిపోతుందో తెలియదు. పైగా భరించలేని శబ్దం. ఎప్పుడు దిగిపోదామా అనిపిస్తుంటుంది. కొత్త బస్సులు ఎప్పుడు వస్తాయో చూడాలి.

హైటెక్ బస్సులు అనవసరం

తిరుపతిరావు, గడ్డమణుగు



ఈ రూట్‌లో సిటీ బస్సులు తిప్పితే మంచిది. హైటెక్ బస్సులు సిటీ సర్వీసుగా 350కి తిప్పుతున్నారు. అందులో నిలబడాలంటే ఇబ్బందిగా ఉంది. పట్టుకునేందుకు ఏం లేకపోవడంతో సడన్ బ్రేక్ వేసినప్పుడు పిల్లలు, పెద్దలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మంచి బస్సులు నడపాలి.

ఆగిపోవడంతో అవస్థలు

పోతురాజు ఏసుదాసు, కొండపల్లి



బస్సులు ఎక్కడ పడితే అక్కడే ఆగిపోతున్నాయి. అర్జెంట్‌గా ఆఫీసుకు, లేదా ఇతర పనులకు వెళ్లేవారు ఈ బస్సులతో అనేక అవస్థలు పడుతున్నారు. మరో బస్సు వచ్చే వరకు అక్కడే ఉండి ఎక్కాల్సి వస్తుంది. అందులో ఖాళీ ఉండదు. ఇలా ఎక్కడ పడితే అక్కడ బస్సులు ఆగిపోవడం ఇబ్బందిగా ఉంది.

బీసెంట్ రోడ్‌లో అనధికార వ్యాపారులను గుర్తించండి

- లైసెన్స్ లేకుండా ఎంతమంది అమ్మకాలు జరుపుతున్నారు?
- అనుమతిచ్చిన ప్రాంతాలను వ్యక్తిగతంగా పరిశీలించండి
- పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయండి
- వీఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం
- విచారణ జూలై 16కి వాయిదా

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బీసెంట్ రోడ్డుతో పాటు నగరంలోని ఇతర రోడ్లలో వ్యాపారం చేసుకొనేందుకు ఎంతమంది వీధి వ్యాపారులకు అనుమతిచ్చారు? ఎంతమంది అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారో గుర్తించాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్‌ను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. వీధి వ్యాపారులు అమ్మకాలు జరుపుకొనేందుకు అనుమతిచ్చిన ప్రాంతాలను వ్యక్తిగతంగా పరిశీలించాలని కమిషనర్‌కు ఆదేశించింది. ప్రతీ జోన్‌లో ఎంతమందికి వీధివ్యాపారులకు లైసెన్స్‌లు జారీ చేశారు? రోజులో ఎన్ని గంటలు, ఏ సమయంలో వారు అమ్మకాలు జరిపేందుకు అనుమతిచ్చారు? తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషనర్‌ను ఆదేశించింది. ఈ అఫిడవిట్‌లో కార్యాచరణ ప్రణాళికను సైతం పొందుపర్చాలని ఆయనకు స్పష్టం చేసింది. విచారణను జులై 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. బీసెంట్ రోడ్డు మధ్యలో, ఇరువైపుల ఆక్రమించి చట్టవిరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వీధి వ్యాపారులు, హాకర్లపై చర్యలు తీసుకొనేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించాలని కోరుతూ బీసెంట్ రోడ్ బిల్డింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వెంకట విజయప్రసాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. వీధి వ్యాపారుల జీవనోపాధి రక్షణ, విక్రయాల నియంత్రణ చట్టంలోని చట్టనిబంధనలు అమలు చేసేలా కార్పొరేషన్ అధికారులను ఆదేశించాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది డి.హర్షవర్ధన్ వాదనలు వినిపించారు. వీధి వ్యాపారులు బీసెంట్ రోడ్డు మొత్తాన్ని ఆక్రమించారన్నారు. ఆ ప్రాంతంలో నివాసముండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ద్విచక్రవాహనాలు, పోలీసు వాహనాలు వెళ్లేందుకు కూడా కష్టంగా మారిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనం వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బీసెంట్ రోడ్డులో వీధి వ్యాపారుల ఆక్రమణలపై తీసిన ఫొటోలను కోర్టు ముందుంచారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ తరఫు న్యాయవాది ఏఎస్సీ బోస్ వాదనలు వినిపిస్తూ నగరంలో పలుజోన్లు ఏర్పాటు చేసి వీధి వ్యాపారులకు కార్పొరేషన్ లైసెన్స్‌లు ఇచ్చిందన్నారు. గ్రీన్‌జోన్‌లో ఎవరైనా అమ్మకాలు జరుపుకోవచ్చని, అంబర్ జోన్‌లో లైసెన్స్ పొందినవారికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. రెడ్ జోన్‌లో వీధి వ్యాపారులకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. బీసెంట్ రోడ్డులో మొత్తం 150 మంది వీధి వ్యాపారులకు లైసెన్స్‌లు ఇచ్చామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వీధి వ్యాపారులు అమ్మకాలు జరుపుకొనేందుకు అనుమతిచ్చిన ప్రాంతాలను వ్యక్తిగతంగా పరిశీలించాని కమిషనర్‌ను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.


జి.కొండూరు వద్ద జాతీయ రహదారిపై తెల్లవారు జామున లారీలు ఆపి డ్రైవర్లను రీఫ్రెష్ చేసేందుకు నీళ్ల బాటిల్ అందజేస్తున్న కానిస్టేబుల్

స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో..!

- ప్రమాదాలను తగ్గించేందుకు ఈ విధానం ఎంతో మేలు
- ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు

గుణదల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వాటి ఆపాలంటే స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో విధానం పాటిస్తే సరిపోతుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు తెలిపారు. రాత్రివేళల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అందులోనూ తెల్లవారుజామున మరింత ఎక్కువగా జరుగుతున్నాయని సీపీ తెలిపారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ఎన్టీఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. తెల్లవారు జామున జాతీయ రహదారులపై భారీ వాహనాలను ఆపి డ్రైవర్లకు రిఫ్రెష్ అవ్వడానికి నీరందించి ముఖం కడిగించడంతో నిద్రమత్తు పోతుందన్నారు. తెల్లవారు జామున నిద్రమత్తులో ఉండి చాలామంది డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. తెల్లవారు జామున 3 నుంచి 5 గంటల సమయంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అందుకే జాతీయ రహదారులపై ప్రయోగాత్మకంగా గురువారం నుంచి ఈ విధానాన్ని ప్రారంభించినట్టు ఆయన తెలిపారు.

టూరిజం ప్యాకేజీలపై

అవగాహన కల్పించాలి

- కరపత్రాలను ఆకర్షణీయంగా రూపొందించండి
- గైడ్ల నియామకం, శిక్షణపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- కలెక్టర్ లక్ష్మీశ


అధికారులతో సమావేశమైన కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేక్రమంలో పర్యాటకులకు మధురానుభూతి మిగిల్చేలా రూపొందించిన ప్రత్యేక ప్యాకేజీలపై పర్యాటకులకు అవగాహన కల్పించాలని, ఇందుకు సంబంధించి కరపత్రాలను ఆకర్షణీయంగా రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో లక్ష్మీశ, టూరిజం ప్యాకేజీపై పర్యాటక, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) అధికారులతో పాటు వివిధ భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు, మూడు, నాలుగు రోజుల పర్యాటక ప్యాకేజీల వివరాలతో రూపొందించిన కరపత్రాలను పరిశీలించారు. ప్యాకేజీల కింద సందర్శనకు వీలయ్యే ప్రాంతాలు, ప్యాకేజీల ధరలు పర్యాటలకు కల్పించే సౌకర్యాలతో రూపొందించిన కరపత్రాల్లో చేయాల్సిన మార్పుచేర్పులపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్లు, ట్రావెల్ తదితర విభాగాల అసోసియేషన్లతో పాటు వివిధ భాగస్వామ్య పక్షాలతో పలు దఫాల్లో సమావేశాలు నిర్వహించి రూపొందించిన పర్యాటక ప్యాకేజీలపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రచార సామగ్రిని సిద్ధం చేయాలన్నారు. చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటక ప్రదేశాల విశిష్టతను పర్యాటకులకు వివరించేందుకు వీలుగా గైడ్లను గుర్తించాలని, వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లా పర్యాటక అధికారి ఏ శిల్ప, ఏపీటీడీసీ-సీఆర్‌వో సుహాసిని పాల్గొన్నారు.



విద్యార్థులకు కలెక్టర్ సత్కారం

కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షల్లో జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలోని విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయంలో సత్కరించారు. వీరిలో మైలవరం జడ్పీ స్కూల్‌కు చెందిన పసుపులేటి నందిని (593), విజయవాడలోని ఎస్‌టీబీ హైస్కూల్‌కు చెందిన జీ సాయిచరణ్ (593), ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కే ప్రణీత్‌కుమార్ (592), నవోదయ హైస్కూల్‌కు చెందిన కొల్లి స్వాతి (598) ఉన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు పాల్గొన్నారు.

అన్న చేతిలో తమ్ముడు హతం

వత్సవాయి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తమ్ముడిపై అన్న దాడి చేయడంతో తమ్ముడు మృతి చెందిన ఘటన కాకరవాయి గ్రామంలో జరిగింది. బెజ్జం ముక్కంటి - భాగ్యమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. పెద్ద కుమారుడు శ్రీనివాసరావు గతంలోనే చనిపోయాడు. రెండో కుమారుడు కొండ, చివరి కుమారుడు అర్జునుడు. వీరు పక్కపక్క పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. వీరిమధ్య తరచూ వివాదాలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా కొండ, అర్జున్ మధ్య వివాదం చోటు చేసుకోవడంతో తమ్ముడు అర్జున్‌పై అన్న కొండ క్రికెట్ స్టంప్‌తో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అర్జున్ (28)ను బంధువులు జగ్గయ్యపేటకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలిస్తుంగా మార్గమధ్యలో మృతి చెందాడు. అర్జున్ సోదరి కె.రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వత్సవాయి పోలీసులు తెలిపారు.

యాంటీ నార్కోటిక్, ఈగల్ టీం

బృందాల విస్తృత తనిఖీలు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షణ చర్యల్లో భాగంగా విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఏసీపీలు ఎస్.కిరణ్‌కుమార్, కె.లతాకుమారి పర్యవేక్షణలో యాంటీ నార్కోటిక్, ఈగల్ టీమ్స్ బుధవారం రాత్రి నగరంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 45 మంది అనుమానిత వ్యక్తులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఓపెన్ ప్రదేశాల్లో మద్యం సేవించిన 40 మందిని అదుపులోకి తీసుకొని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అప్పగించారు. లేడీస్ హాస్టల్స్ సమీపంలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా మద్యం, గంజాయి ఇతర వస్తువుల రవాణాను నియంత్రించడమే తనిఖీల ముఖ్యోద్దేశమన్నారు.

పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలి

- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్
- విజయవాడ నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన, పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం

విజయవాడ/మొగల్రాజపురం, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి): భారతదేశంపై ఏదో ఒక విధంగా దాడులు చేస్తూ అమాయకుల ప్రాణాలు తీస్తున్న ముష్కరులకు, వారికి అండగా ఉంటున్న పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పి పహల్గావ్ మృతులకు న్యాయం చేయాలని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎండీ ఫరూక్ కోరారు. పహల్గావ్‌లో జరిగిన మారణకాండలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతి కోసం, ముష్కరుల దాడికి నిరసనగా మైనార్టీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం మొగల్రాజపురం మదర్ థెరిసా జంక్షన్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన, పాకిస్తాన్ దిష్టిబొమ్మ దగ్ధం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ దాయాది దేశమైన పాకిస్తాన్ రచించిన విద్వేషపూరిత వ్యూహంలో అమాయకులైన భారత ముస్లింలు పావులుగా మారొద్దని కోరారు. మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎండీ ఫారూక్ షుబ్లీ మాట్లాడుతూ అత్యంత దారుణమైన పహల్గావ్ సంఘటనను కులమతాలకు అతీతంగా ముక్తకంఠంగా ఖండిస్తున్నామన్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రమూకలపై భారత ప్రభుత్వం ప్రతీకార చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈఘటనలో కాల్పింది ఒక ముస్లిం, కాపాడేందుకు ప్రయత్నించి ప్రాణాలర్పించింది కూడా ఒక ముస్లిమేనని అన్నారు. అనంతరం పాకిస్తాన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించిన అనంతరం పాకిస్తాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నేతలు మౌలానా హుస్సేన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎండీ సలీంపాషా, మెయిన్ పాల్గొన్నారు.


పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మంత్రి ఫరూక్, షుబ్లీ, తదితరులు


పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ తదితరులు

పహల్గాం మృతులకు నివాళులు

మచిలీపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి జిల్లాపరిషత్ సమావేశపు హాలులో గురువారం జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ కల్పలత, రాష్ట్ర గౌడసంఘ చైర్మన్ వీరంకి గురుమూర్తి, కలెక్టర్ బాలాజీ, డీఆర్వో కే చంద్రశేఖరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


గన్నవరం విమానాశ్రయంలో చిరంజీవిని గజమాలతో సత్కరిస్తున్న జనసేన నేత చలమలశెట్టి రమేష్‌బాబు

ప్రముఖ సినీనటుడు చిరంజీవికి ఘనస్వాగతం

గన్నవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు చిరంజీవికి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే మంత్రి నారాయణ కుమార్తె శరణి రచించిన మైండ్సెట్ షిఫ్ట్ పుస్తకావిష్కరణలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి గురువారం చేరారు. జనసేన నేత చలమలశెట్టి రమేష్ బాబు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు.

నావికాదళంతో కేయూ ఒప్పందం



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నావికాదళంతో కృష్ణా విశ్వవిద్యాలయం గురువారం పరస్పరం ఒప్పందం కుదుర్చుకుంది. న్యూఢిల్లీలోని నావికాదళ కేంద్రంలో నావెల్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ అభిలాష్ శ్రీకుమారన్ కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు పరస్పరం ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం భారత నావికాళం, కృష్ణా విశ్వవిద్యాలయం సంయుక్తంగా పరిశోధనలు నిర్వహిస్తాయి. కాగా నావికాదళ అధికారులు, వారి కుటుంబ సభ్యులు కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే వీలు కలుగుతుంది. సీవీఆర్ తరుణ్‌చంద్ కమల్ పాల్గొన్నారు.


మడుపల్లి బాలకృష్ణమూర్తిని సత్కరిస్తున్న పీడీలు

రగ్బీ క్రీడాకారులకు ప్రోత్సాహం

- కృష్ణాజిల్లా నూతన చైర్మన్ బాలకృష్ణమూర్తి

గన్నవరం ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రగ్బీక్రీడపై ఆసక్తిగల క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అవసరమైన సహాయసహకారాలను అందజేస్తానని కృష్ణాజిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన మడుపల్లి బాలకృష్ణమూర్తి అన్నారు. గన్నవరంలో గురువారం నిర్వహించిన అభినందన సభలో ఆయన్ను పీడీలు ఘనంగా సత్కరించారు. రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తదనంతరం జరిగిన సభలో రగ్బీ క్రీడను బీ కేటగిరి నుంచి ఏ కేటగిరి మార్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, అందుకు కృషి చేసిన రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు టీజీ భరత్, రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 2016 నుంచి జిల్లాలో రగ్బీ క్రీడను ప్రోత్సహిస్తూ కృషి చేసిన మద్దినేని సత్యప్రసాద్‌కు నూతన కార్యవర్గం అభినందనలు తెలిపింది. వైస్ చైర్మన్ జొన్నలగడ్డ సుధాకర్, కార్యవర్గ సభ్యుడు వేమూరి వేణు, కమిటీ సభ్యులు, వ్యాయామోపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాముకు పటిష్ఠ భద్రత: కలెక్టర్

కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం సాధారణ తనిఖీల్లో భాగంగా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును గురువారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందిస్తామన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, వై.రామయ్య (టీడీపీ), వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి ఉన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

పెదపారుపూడి ఇన్‌చార్జి ఎంపీడీవోగా మల్లీశ్వరి

పెదపారుపూడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి ఎంపీడీవోగా పని చేస్తున్న టి.సీతా మహాలక్ష్మి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డిప్యూటీ జోనల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నందివాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న మల్లీశ్వరి ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమితులై బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీడీవోగా సమర్థవంతంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సీతామహాలక్ష్మిని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సత్కరించి వీడ్కోలు పలికారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సాగర రాణి, చైతన్య శ్రీనివాస్, సురేష్, దయామణి, నాగమణి, విజయ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లీశ్వరి



గుడివాడలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు



పామర్రులో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న జనసేన నాయకులు



మౌనం పాటిస్తున్న గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రం ఉద్యోగులు



గుడివాడ జనసేన కార్యాలయంలో నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

ఉగ్రదాడి హేయమైన చర్య

'పహల్గాం' మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీలు

గుడివాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని కూటమి నాయకులు అన్నారు. మారణకాండకు నిరసనగా కూటమి నేతల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. పహల్గాంలో విహారయాత్రకు వెళ్లిన వారిని చంపడం దారుణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు అన్నారు. ఉగ్రదాడులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ తీరును ప్రపంచదేశాలు తప్పుపట్టాలన్నారు. దేశంలో ఉగ్రవాదం నశించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మచిలీపట్నం కన్వీనర్ సూరే గాంధీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ, ఎర్రపోతు అర్జున్, జనసేన పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో..

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం జనసేన నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఉగ్రదాడిలో అమాయక ప్రజలు మరణించటం చాలా బాధాకరమన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, చింతా రామకృష్ణ, గుండు వెంకట్రావు, సుంకర వెంకట్, పరీష్, నాని పాల్గొన్నారు.

ముష్కరుల దాడి అమానుషం

పహల్గాంలో పర్యాటకులపై ముష్కరుల దాడి అమానుషమని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం తన వ్యక్తిగత కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి ఉగ్రదాడుల వలన దేశ సమగ్రతను దెబ్బతీయాలని చూస్తున్నారని, తప్పనిసరిగా కేంద్రం బుద్ధి చెబుతుందని ఆయన హెచ్చరించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా దేశ ఐక్యతను దెబ్బతీయలేరన్నారు.

మండల కార్యాలయం ఎదుట..

గుడివాడ రూరల్: ఉగ్రదాడి హేయమైన, పిరికిపంద చర్య అని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నినదించారు. పహల్గాంలో ఉగ్రదాడిలో మరణించిన మృతుల కుటుంబాలకు కార్యాలయం ఎదుట వారు నివాళులర్పించారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్, శ్రీనివాసరావు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలశీతల కేంద్రం ఉద్యోగుల సంఘీభావం

గుడ్లవల్లేరు: ఉగ్రదాడిలో 28 మంది మృతికి సంతాప సూచకంగా గుడ్లవల్లేరులోని పాలశీతల కేంద్రం ఉద్యోగులు మౌనంపాటించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆదేశాల మేరకు కార్యాలయ సిబ్బందితో శాంతి సమావేశం నిర్వహించి మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలిపామని మేనేజర్ తోట సత్యనారాయణ తెలిపారు.

పామర్రులో ర్యాలీ

పామర్రు: పహల్గాం ఉగ్రదాడి పిరికిపందల చర్య అని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తాడిశెట్టి నరేష్ అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కాకి ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావు, ఐదు మండలాలకు చెందిన జనసేన శ్రేణులు పాల్గొన్నారు.



పని ప్రదేశంలో ఉపాధి కూలీలు

కనీస సదుపాయాల్లేవు!

● పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు ఇక్కట్లు

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి): పని ప్రదేశాల్లో కనీస సదుపాయాలు లేక ఉపాధి కూలీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు, దాహార్తిని తీర్చుకునేందుకు మంచినీటి సౌకర్యం, పని చేసేడప్పుడు గాయాలైతే ప్రాథమిక చికిత్సకు అవసరమైన కిట్లు లేవు. దీంతో నానా అవస్థలు పడుతున్నారు. మొవ్వ మండలంలో 21 పంచాయతీలు ఉండగా, రోజూ 3 వేల మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. పంట బోదెల తవ్వకం, శ్మశాన వాటికల అభివృద్ధి, ముళ్లకంపల తొలగింపు, ప్రభుత్వ స్థలాల మెరక పనులు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో 30 రోజులకు మించి పనిదినాలు కల్పించటం లేదని, తక్కువ వేతనాలు వస్తున్నాయని, మూడు, నాలుగు వారాలు వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని కార్మికులు చెబుతున్నారు.

వేలికి గాయమై రూ.11 వేలు ఖర్చయింది



పని చేస్తుండగా పలుగు తగిలి బొటనవేలికి గాయమైంది. సెప్టిక్ అవడంతో వైద్యం చేయించుకుంటే రూ.11 వేలు ఖర్చయింది. మందు బిళ్ల ఇచ్చి టింక్చర్ వేసి కట్టుకట్టిన వారు లేకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చింది. అధికారులెవరూ పట్టించుకోలేదు. - పామర్తి శ్రీలక్ష్మి, పెడసనగల్లు

ఉపాధి కూలీలను ఆదుకోవాలి



కూలీలు పని చేస్తున్న ప్రదేశాల్లో కనీస సదుపాయాలు కల్పించాలి. 200 రోజుల పనిదినాలు కల్పించాలి. రోజువారీ వేతనాన్ని రూ.600లకు పెంచాలి. సకాలంలో వేతనాలు చెల్లించాలి. లేని పక్షంలో ఉపాధి కూలీల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తాం. - శీలం నారాయణరావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు

బందరు కాలువలో మృతదేహం

తోట్లవల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గేదెలు మేపడానికి వెళ్లి ఈనెల 21వ తేదీన బందరు కాలువలో గల్లంతైన కూచిపూడి రాజారావు(59) మృతదేహాన్ని గురువారం గుర్తించారు. పమిడిముక్కల మండలం శ్రీరంగపురానికి చెందిన రాజారావు ఎనిమిదేళ్లుగా వల్లూరుపాలెంలో కుమార్తె బందెల కరుణ వద్ద ఉంటున్నాడు. రోజూ గేదెలను మేపుకొస్తాడు. 21వ తేదీన గేదెలు మేపేందుకు వెళ్లిన రాజారావు తిరిగి ఇంటికి రాకపోవటంతో 22వ తేదీన కుమార్తె కరుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకొచ్చి బందరు కాలువలో గాలింపు చేపట్టారు. గురువారం కాలువలో రాజారావు మృతదేహాన్ని గుర్తించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ప్రజావేదికలో నేడు ప్రజాదర్బార్

గుడివాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో స్థానిక ప్రజావేదికలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలోని సమస్యలపై వినతిపత్రాలు, అర్జీలను ఎమ్మెల్యే స్వీకరిస్తారని పేర్కొంది. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నంబరును అర్జీ లేదా వినతిపత్రంలో పేర్కొనాలని సూచించింది.

వంతెనకు మరమ్మతులు చేయండి

కూచిపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాజ గ్రామంలో ఐనంపూడి డ్రెయిన్‌పై ఉన్న బ్రెయిలీ బ్రిడ్జి(ఇనుప వంతెన) శిథిలావస్థకు చేరి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. 1, 2 సంవత్సరాల్లో శాశ్వత వంతెన నిర్మించే వరకు తాత్కాలిక వంతెన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పి పదిహేనేళ్లు గడుస్తోందని, ఇనుప వంతెన శిథిలావస్థకు చేరినా మరమ్మతులైనా చేపట్టకపోవటం వల్ల ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. వంతెన ప్లాట్‌ఫామ్ రేకులు పగిలిపోయి తేలికపాటి వాహనాలకే వంతెన ఊగిపోతోందని తెలిపారు. మొవ్వ నుంచి మచిలీపట్నం వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడం, రైతులు పండించిన పంట ఉత్పత్తులు తరలించేందుకు ఏకైక రహదారి కావటం వల్ల ఈ వంతెనకు ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వంతెన మరమ్మతులు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కాజలో ఐనంపూడి డ్రెయిన్‌పై ధ్వంసమైన బెయిలీ వంతెనను చూపుతున్న గ్రామస్థులు

మోటూరు తాగునీటి చెరువు పూడిక తీయించండి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మోటూరు గ్రామంలో తాగునీటి చెరువు పూడిక తీయించి ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని పంచాయతీ అధికారులను సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి కోరారు. గురువారం మోటూరులో తాగునీటి అవసరాలు, మరమ్మతుల కోసం ఎండగట్టిన తాగునీటి చెరువును సీపీఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పాతికేళ్ల నుంచి ఈ చెరువు పూడికతీత పనులు చేపట్టలేదని గ్రామస్థులు అంటున్నారని, త్వరగా పూడికతీత చేపట్టాలని కోరారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌పై పట్టుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు

గుడివాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్‌పై పట్టుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ ఇంగ్లీష్ భాషా దినోత్సవం సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ డిగ్రీతో పాటుగా ఇంగ్లీష్ మాట్లాడడంలో నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. అప్పుడు మంచి ఉద్యోగాలు పొందొచ్చని, విదేశాల్లో మెరుగైన అవకాశాలు పొందవచ్చని ఆయన తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్కే ప్రసాద్, కేఏస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఇంగ్లిషు అధ్యాపకులు ప్రకాష్, ఎ.సూకీల పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో ఏఎన్ఆర్ కళాశాల పాలకవర్గ సభ్యులు

ఖో-ఖో జాతీయ పోటీలకు ఎస్పీఎస్ విద్యార్థి

గుడివాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరు జిల్లా పుత్తూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఖో-ఖో అండర్-19 రాష్ట్ర పోటీల్లో ఎస్పీఎస్ మున్సిపల్ ప్లస్ పాఠశాలకు చెందిన డి.కృష్ణవేణి అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రజట్టుకు ఎంపికైందని ఖో-ఖో కోచ్ మడకా ప్రసాద్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో కృష్ణవేణిని ఆయన అభినందించారు. ఈ నెల 30 నుంచి మే 4 వరకు నిర్వహించే జాతీయ పోటీల్లో రాష్ట్రజట్టు తరపున ఆడుతుందన్నారు. కృష్ణవేణిని ఖో-ఖో సంఘం జిల్లా చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కార్యదర్శి మద్దినేని సత్యప్రసాద్, డీసీపీ జిల్లా కార్యదర్శి షేక్ జాన్‌సాహెబ్, విద్యాకమిటీ చైర్మన్ తేలు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు వై.శ్రీనివాసరావు అభినందించారు.



రాష్ట్రజట్టుకు ఎంపికైన కృష్ణవేణిని అభినందిస్తున్న మడకా ప్రసాద్

రైల్వే గేటు వెడల్పు చేయాలి

గుడివాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేటీఆర్ కళాశాల రోడ్డులోని రైల్వే గేటును వెడల్పు చేయాలని భవిష్యత్ భద్రతా దళం నాలుగు వేల మంది నుంచి సంతకాలను సేకరించింది. గురువారం విజయవాడ రైల్వే డీఆర్ఎం కార్యాలయంలోని సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కె.శ్రీధర్‌కు భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ ప్రజాసంతకాల వినతిపత్రాన్ని అందజేశారు. ట్రాఫిక్ సమస్యలను ఇంజనీర్ శ్రీధర్‌కు వివరించారు. దళం సభ్యులు పాల్గొన్నారు.



డీఆర్ఎం కార్యాలయంలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న భవిష్యత్ భద్రతా దళం సభ్యులు

వడ్లమన్నాడు విద్యార్థినికి అభినందన

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో మండల ప్రథమ స్థానం సాధించిన సింగంశెట్టి శ్రీనాగలక్ష్మీసంజనను వడ్లమన్నాడు గ్రామస్థులు అభినందించారు. గురువారం వడ్లమన్నాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శ్రీనాగలక్ష్మీ సంజనను ప్రధానోపాధ్యాయుడు బోయిన ప్రసాద్‌ను, ఉపాధ్యాయులను గ్రామస్థులు సన్మానించారు. శ్రీనాగలక్ష్మీసంజనకు రూ.పది వేల నగదు బహుమతిని గ్రామ పెద్ద పెన్నేరు ప్రభాకర్ ద్వారా బీజేపీ మండల అధ్యక్షుడు శేషం నగేష్ అందజేయించారు. ఉపసర్పంచ్ గరికపాటి రాంబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెన్నేరు రమేష్, జనసేన మండల అధ్యక్షుడు తోట చిన్నారి, నత్తా ప్రసాద్, సింగంశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.



శ్రీనాగలక్ష్మీసంజనకు నగదు బహుమతి అందజేస్తున్న పెన్నేరు ప్రభాకరరావు

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

పామర్రు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఒకటో గ్రామ సచివాలయం వద్ద గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్, మహాత్మ గాంధీ చిత్రపటాలకు సర్పంచ్ కె.కస్తూరి పూలమాలలేసి నివాళులర్పించారు. గ్రామ పారిశుధ్య కార్మికుల్ని సత్కరించారు. గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం, శానిటరీ అధికారి సుధాకర్, పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ గాంధీ చిత్రపటాలకు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, ఎంపీడీవో రవికాంత్ నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంఈవో-2 సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తోట్లవల్లూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పెనుముత్స రాధిక, కార్యదర్శి రవికుమార్, సునీల్ పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ కె.మహేశ్, మండల పరిషత్ కార్యాలయ ఏవో జి.రామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ పృథ్వీరాజ్, ఎంపీటీసీ సభ్యుడు గుర్విందపల్లి వంశీ పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



పామర్రులో మహాత్మ గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ కస్తూరి



తోట్లవల్లూరు మండల కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాజామణి

క్రికెట్ పోటీల్లో గుడ్లవల్లేరు మండల పంచాయతీరాజ్ జట్టు విజయం

గుడ్లవల్లేరు: పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి పంచాయతీరాజ్ సిబ్బంది క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో గుడ్లవల్లేరు మండల జట్టు విజేతగా నిలిచింది. గురువారం నిర్వహించిన ఫైనల్స్‌లో నాగాయలంక మండల జట్టుతో గుడ్లవల్లేరు టీమ్ తలపడింది. ముందుగా బ్యాటింగ్ ఎంచుకొన్న గుడ్లవల్లేరు టీమ్ 10 ఓవర్లకు 74 పరుగులు తీసింది. నాగాయలంక జట్టు పది ఓవర్లకు 59 పరుగులు తీసింది. గుడ్లవల్లేరు జట్టు 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. జట్టు కెప్టెన్‌గా వడ్లమన్నాడు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ వ్యవహరించారు. వీరికి ట్రోఫీని శుక్రవారం మచిలీపట్నంలో అందించనున్నారు.



విజయ చిహ్నం చూపుతున్న గుడ్లవల్లేరు మండల పంచాయతీరాజ్ జట్టు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420



ఫార్మశీ భవనాలను త్వరగా పూర్తి చేయాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఫార్మశీ కళాశాల భవనాలను త్వరితగతిన నిర్మించాలని కృష్ణా వర్సిటీ వీసీ కూన రాంజీ అన్నారు. రూ. 10 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మశీ కళాశాల భవనాలను కూన రాంజీ గురువారం పరిశీలించారు. ఇంజనీరింగ్ సిబ్బంది, ఫార్మశీ కళాశాల అధ్యాపకులతో భవన నిర్మాణాల విషయమై చర్చించారు. ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి మణికంఠకు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

విభ వర్డ్ పవర్ చాంపియన్ జతిన్ మణికంఠ

నాగాయలంక, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ముంబైలో జరిగిన విభ వర్డ్ పవర్ పోటీల్లో మండలంలోని వక్కపట్లవారిపాలెం ప్రభుత్వ పాఠశాల మూడో తరగతి విద్యార్థి జతిన్ మణికంఠ నేషనల్ చాంపియన్‌గా నిలిచి సత్తా చాటాడు. ఈ పోటీల్లో 11 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనగా, జిల్లా నుంచి నాగాయలంక మండలం వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థి జతిన్ మణికంఠ పాల్గొని జాతీయ స్థాయి విజేతగా నిలిచి అందరి అభిమానాలను చూరగొన్నాడు. ప్రతిభను గుర్తించి, శిక్షణ అందించి దేశ స్థాయిలో విజేతగా మణికంఠ నిలవటానికి కృషి చేసిన ఉపాధ్యాయురాలు కోట విజయ నిర్మలను గ్రామ ప్రజలు అభినందించారు.



టెన్త్ ప్రతిభావంతులకు అభినందన

మోపిదేవి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్‌కు పదవ తరగతి పునాది అని జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జున రావు అన్నారు. మోపిదేవి జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 13 మంది విద్యార్థులను పాఠశాల విద్యాకుటుంబం గురువారం ఘనంగా సత్కరించింది. ఎండల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి మోపిదేవి జిల్లా పరిషత్ పాఠశాల మరోసారి సత్తా చాటిందన్నారు. విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు పి.జయంతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

చేనేత పరికరాల ధ్వంసం..నేతల పర్యటన

గూడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కప్పలదొడ్డి గ్రామానికి చెందిన పేరిశెట్టి ఫైడేశ్వరరావు, బూసం పురుషోత్తం ఇళ్లలోని చేనేత పరికరాలు, ముడిసరుకులకు పది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మరో ఆరుగురికి చెందిన చేనేత పరికరాలు, ముడి సరుకులు, నూలుకు మంగళవారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. దీంతో గ్రామ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. చేనేత నాయకులు గురువారం కప్పలదొడ్డి గ్రామాన్ని సందర్శించి సంఘటన జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ మాట్లాడుతూ, సమగ్ర విచారణ జరిపి దోషులను వెంటనే శిక్షించాలన్నారు. దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పడవల మోహనత్రినాథ్, కప్పలదొడ్డి సర్పంచ్ యక్కల మాధవి నాగరాజు, పోలవరం మాజీ సర్పంచ్ కారుపర్తి మల్లి, పిచ్చుక ఫణికుమార్, ఆకురాతి జనార్దన్, తాళ్ళ బాలాజీ, బళ్ళ సాంబశివరావు, వీవర్స్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కప్పలదొడ్డి సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న చేనేత నేతలు



మచిలీపట్నంలో నిరసన ర్యాలీలో ఎంపీ బాలశౌరి, జనసేన నేత బండి రామకృష్ణ



అవనిగడ్డలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న జనసేన నేతలు



ఘంటసాలలో కొవ్వొత్తుల ప్రదర్శనలో కూటమి నేతలు

ఉగ్రదాడి అమానుషం

జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ ● మృతులకు మంత్రి సుభాష్ తదితరుల నివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో గ్రవాదులు చర్య దుర్మార్గమని, ఈ దారుణాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తానని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. పెహల్గాంలో 28 మంది పర్యాటకులను ఉగ్రవాదులు బలి తీసుకోవడాన్ని ఖండిస్తూ గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అండగా ఉంటారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నాయకులు గడ్డం రాజు, మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మృతులకు నివాళులర్పించారు. మౌనం పాటించారు.



వాసవీ క్లబ్ కొవ్వొత్తుల ప్రదర్శన

కశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ గొడుగుపేటలో వాసవీ క్లబ్ ప్రతినిధులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. యెండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, వేముల శిరీష, అన్నం అశోక్, జల్లూరి దివ్య, అనూరాధ, రాంబాబు, జయవరపు ప్రసాద్, సంగీత, గుడివాడ మెహర్‌ప్రసాద్, ఉదయగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అంతం చేయాలని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు అన్నారు. కశ్మీర్‌లో ఉగ్ర చర్యను ఖండిస్తూ, మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనసేన నేతలు రాయపూడి వేణుగోపాల్, చన్నగిరి సత్యనారాయణ, అన్నపరెడ్డి వెంకటస్వామి, రాజనాల వీరబాబు, బొప్పన భాను, బచ్చు కృష్ణకుమారి, మత్తి సుబ్రహ్మణ్యం, కమ్మిలి సాయిభార్గవ, కోసూరు అవినాష్, బీజేపీ మండల అధ్యక్షులు శోభిల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** పెహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు నివాళులు అర్పించారు. చల్లపల్లి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, టీడీపీ నేతలు తలశిల స్వర్ణలత, బండె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీలో మంత్రి సుభాష్ తదితరులు



చల్లపల్లిలో ఆర్యవైశ్య సంఘం కొవ్వొత్తుల ర్యాలీ

ఆర్యవైశ్య సంఘం నివాళి

పెహల్గాం ఉగ్రదాడి నిందితులను కఠినంగా శిక్షించాలని చల్లపల్లి ఆర్యవైశ్య సంఘ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాత్రి చల్లపల్లి పురవీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులు అర్పించారు. సంఘ అధ్యక్ష కార్యదర్శులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్‌కుమార్, తమ్మన సాంబశివరావు, మాజేటి అమరవాణి, భారతి, కొల్లిపర మధు, సరస్వతి, రాజశేఖర్, కిషోర్, మారుతి, ద్రోణ, దుర్గ, జయలక్ష్మి పాల్గొన్నారు. **ఘంటసాల :** పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘంటసాల గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనను ప్రతీ ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని అన్నారు. ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి శ్రీనివాస్, జనసేన నేతలు సిద్ధినేని కుమార్ రాజా, సూదాని నందగోపాల్, రాజనాల వీరబాబు, పసుపులేటి రవికుమార్, డొక్కు భీమరాజు, యార్ల శ్రీకాంత్, సుగ్గన పవన్, ఆవుల ధర్మవెంకట నరసయ్య, ఏనుగ పాండు తదితరులు పాల్గొన్నారు.



బంటుమిల్లిలో కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే కాగిత

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

బంటుమిల్లి : జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పెడన ఎమ్మెల్యే కాగిత అన్నారు. ఉగ్రవాద దాడులను ఖండిస్తూ గురువారంబంటుమిల్లిలో జరిపిన కొవ్వొత్తుల నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఆటవిక చర్యలకు బాధ్యులైన వారిని భారత ప్రభుత్వం తగు విధంగా శిక్షించాలని, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు న్యాయం జరగాలని కోరారు. టీడీపీ, బీజేపీ, జనసేన, సీపీఎం ప్రజా సంఘాలు ర్యాలీలో పాల్గొన్నాయి.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

పంచాయతీరాజ్ దినోత్సవంలో వక్తలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్ఠపరుస్తూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కానూరు గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామసభలో గోపు సత్యనారాయణ మాట్లాడారు. దివి మహేష్, వెంకటేశ్వరరావు, బొలిశెట్టి నాని, గోపు వెంకట రమణ, చక్కా ఏడుకొండలు, జొన్నల వెంకటేశ్వరరావు, జి. సత్యనారాయణ, శ్రీదేవిపాల్గొన్నారు. **కోడూరు :** పంచాయతీరాజ్ దినోత్సవం సర్పంచ్ వెన్నా పైనీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గ్రామ సభ నిర్వహించారు. పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు కార్యదర్శి బండే శేష గిరిరావు బహుమతులు అందించారు. సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **ఘంటసాల :** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ వేమూరి రజనికుమారి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో డి.సుబ్బారావు, ఈవోపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, ఏవో శ్రీనివాస చంద్ పాల్గొన్నారు. **గూడూరు :** గూడూరు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ సులోచనారాణి డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి టి.వి. భాస్కరరావు, జూనియర్ అసిస్టెంట్ టి. శివరామప్రసాద్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. **మోపిదేవి :** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జున రావు, ఇంచార్జ్ ఎంపీడీవో పాండురంగారావు, ఈవోపీఆర్డీ కె.టి.సుందరి ఉన్నారు. శివారు ప్రాంతాలైన రావివారిపాలెం, బోడగుంట వరకు మంచినీరు పూర్తిస్థాయిలో అందేలా చూడాలంటూ గ్రామస్థులు సర్పంచ్ మేరీ రాణి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో అధికారులను నిలదీశారు.

పట్టాభి స్మారక భవనం నిర్మాణానికి కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పును మన్నించి స్వాతంత్ర్య సమర యోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి మునిసిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు కోరారు. ఈడేపల్లిలోని రాయపాటి శ్రీరాములు మునిసిపల్ పార్కులో గురువారం 45వ డివిజన్, శ్రీరాములు పార్కు అభివృద్ధిపై జరిగిన సమీక్షా సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు మాట్లాడారు. అభివృద్ధికి రాజకీయ పార్టీలకతీతంగా అందరూ సహకరించాలన్నారు. గొర్రెపాటి గోపీచంద్, పి.వి.ఫణికుమార్, ఇంజనీరు ఆర్వీఎస్ మురళీధర్, డాక్టర్ బొల్లా ప్రసాద్, కాశీపట్నపు రఘు, గంజాల రవికుమార్, కొనకళ్ళ రఘు, కొనకళ్ళ భాను, అరుణ్ కుమార్, ఎఆర్‌కె మూర్తి, న్యాయవాదులు కోట మెహర్ ప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు, అద్దేపల్లి నిరంజన్, కాలనీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. గొర్రెపాటి గోపీచంద్, పి.వి.ఫణికుమార్‌లను కాలనీ వాసులు ఘనంగా సత్కరించారు.



బోలెం రామారావుకు ఘనసన్మానం

చల్లపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బంగారు నంది అవార్డు స్వీకరించిన ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావును ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ఘనంగా సత్కరించారు. చల్లపల్లిలో జరిగిన టీడీపీ నియోజకవర్గ సమావేశంలో బోలెం రామారావు - నాగమణి దంపతులను ఘనంగా సన్మానించారు. అవనిగడ్డ ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన కొల్లూరు వెంకటేశ్వరరావును మంత్రి సన్మానించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, పార్టీనేతలు పాల్గొని రామారావు, వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

నూతన దంపతులకు ఎంపీ బాలశౌరి ఆశీర్వాదం

కోడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కూరాకుల చంద్రశేఖరరావు కుమారుడు రిసెప్షన్‌కు ఎంపీ వల్లభనేని బాలశౌరి హాజరై నూతన వధూవరులు కూరాకుల గోపికృష్ణ - శ్రావణిలను ఆశీర్వదించారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు, మర్రె గంగయ్య, సునీత, శంకరరావు, చిట్టిబాబు, రాంబాబు, కరుణ కుమార్, రామారావు, పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.



ఘనంగా ఉరుసు మహోత్సవం

గూడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గూడూరు పఠాన్‌పేటలో హజరత్ నిర్గన్‌షా ఔలియా బాబా సందల్ (ఉరుసు) మహోత్సవం గురువారం ప్రారంభమయింది. ప్రధాన రహదారి వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. కులమతాలకతీతంగా హిందూ, ముస్లింలు బాబాను దర్శించుకున్నారు. బాబా ప్రతీకలు ప్రత్యేకంగా అలంకరించి గుర్రంపై గ్రామపు రవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల మిఠాయి సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను దర్గా కమిటీ ప్రెసిడెంట్ ఎండి యాసిన్ పర్యవేక్షించారు.

మోర్ల ప్రసాద్‌కు మంత్రి సుభాష్ పరామర్శ

చల్లపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సతీవియోగానికి గురైన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. మోర్ల ప్రసాద్, కుమారులు మోర్ల రాంబాబు, శివలను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు తదితర నేతలు మంత్రితోపాటు పరామర్శించిన వారిలో ఉన్నారు. బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి మోర్ల ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి మల్లేశ్వరి మృతికి సానుభూతి తెలిపారు.



సీఎం సహాయ నిధి పత్రాల పంపిణీ

అవనిగడ్డ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన 34 మందికి సీఎంఆర్ఎఫ్ రూ.20,86,074 సాయం మంజూరు పత్రాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఇప్పటి వరకు 259 మందికి రూ.1.89 కోట్ల మొత్తాన్ని వైద్యం కోసం సాయంగా అందించిందని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. పేద వైద్యం కోసం విరివిగా సాయమందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నాన్‌స్పౌజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నాన్ స్పౌజ్ ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాన్ని సవరించి ప్రత్యేక పాయింట్లు కల్పించాలని నాన్ స్పౌజ్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బదిలీల్లో భా ర్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే ఐదు అదనపు పాయింట్లు కల్పిస్తున్నారని, భార్య లేదా భర్తల్లో ఒక్కరే ఉద్యోగి అయిన నాన్‌స్పౌజ్ టీచర్లకు ఎలాంటి మాత్రం ఎలాంటి ప్రత్యేక ప్రయోజనాలు లేకుండా దూర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బుద్ధప్రసాద్‌ని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఎన్.సుధారాణి, కుమార్, ఎం.శ్యామ్ ప్రసాద్, కె.సుధారాణి, బి.వి.నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఘంటసాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రతాప్ రెడ్డి సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం మైక్ ప్రచారం నిర్వహించారు. దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ఆరుబయట నిద్రించే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఇళ్లవద్దనే ఉంటున్నందున వారిని చెరువుల వైపు కాలువ వైపు వెళ్లనీయొద్దన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వస్తువులను లాకర్‌లో భద్రపర్చుకోవాలన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

గూడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రాయవరం గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయం మొదటి వార్షికోత్సవ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి నాయకులు కాసగాని శ్రీను, గోపీ నాగబాబు, బట్టు భావనారాయణ, చిన్నం వెంకటేశ్వరరావు, బాబు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పరదాల వ్యాపారి మృతి

పెడన, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పరదాల వ్యాపారి బుధవారం రాత్రి మృతిచెందాడు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జున్నూరు గ్రామానికి చెందిన కడియాల బ్రహ్మానందం (50) ప్రతి యేటా పెడన మండలం చెన్నూరు వచ్చి రైతులకు పరదాలు అద్దెకిస్తుంటాడు. ఈనెల 14వ తేదీ రాత్రి సింగరాయపాలెంలో భోజనం పార్శిల్ తీసుకుని తిరిగి చెన్నూరు వస్తుండగా మార్గ మధ్యంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో బ్రహ్మానందం తలకు బలమైన గాయమైంది. గుడివాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ బ్రహ్మానందం బుధవారం రాత్రి చనిపోయాడు.